VELTHURU TELUGU DAILY

# వెలుతురు

## తెలుగు దిన పత్రిక

హైదరాబాద్
సోమవారం 18.05.2026

సంపుటి: 07 సంచిక: 343
పేజీలు: 12 వెల: రూ. 5/

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH

Velthuru Newspaper





## ఢిల్లీలో వర్క్ ఫ్రమ్ హోం

- ఇంధన పొదుపు చర్యలకు ప్రభుత్వం పిలుపు
- ఇంధన వినియోగం తగ్గించేందుకు ప్రైవేటు సంస్థలకు ఢిల్లీ సూచనలు
- వారానికి రెండు రోజుల వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని సిఫార్సు
- ఆఫీస్ సమయాల్లో మార్పులు చేసుకోవాలని అడ్వైజరీలో సూచన
- ఉద్యోగులు కార్‌పూలింగ్ విధానం పాటించాలని ప్రభుత్వ విజ్ఞప్తి

# వేదపాఠశాల శంకుస్థాపనకు రండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ ఆహ్వానం
- 23న యాదగిరిగుట్టలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహణ
- శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వేద పాఠశాల నిర్మాణానికి శ్రీకారం
- దేవస్థాన అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన
- సీఎం రేవంత్ రెడ్డిని కలిసి అధికారిక ఆహ్వానం అందజేత
- మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో ఆహ్వాన బృందం
- యాదగిరిగుట్ట అర్చకులు, ఆలయ ప్రతినిధుల హాజరు
- కార్యక్రమానికి విస్తృత స్థాయి ప్రభుత్వ ప్రతినిధుల పాల్గొనడం
- ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరు
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కూడా సమావేశంలో పాల్గొనడం
- వేద విద్యా పరిరక్షణకు ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారనుందని అభిప్రాయం

వెలుతురు, హైదరాబాద్ మే 17:

జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి కొండా సురేఖ కలిసి యాదగిరిగుట్టలో జరగనున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వేద పాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి అధికారికంగా ఆహ్వానించారు. ఈ నెల 23వ తేదీన యాదగిరిగుట్టలో ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేద పాఠశాల నిర్మాణంతో పాటు దేవస్థానానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. వేద విద్యా పరిరక్షణ, సాంప్రదాయ హిందూ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

..మిగతా 2లో






## కొలువు దీరనున్న కేరళ కొత్త ప్రభుత్వం

- మే 18న వీడీ సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం
- యూడీఎఫ్ ఘన విజయం తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం
- ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ మే 18న ప్రమాణస్వీకారం
- మొత్తం 20 మంది మంత్రులతో కొత్త క్యాబినెట్ ఏర్పాటు
- గవర్నర్‌కు మంత్రివర్గ జాబితా సమర్పించిన సతీశన్

2

# సర్ పై బీజేపీ, బీఆర్ఎస్ విష ప్రచారం

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపాటు

- ఒక్కరికి ఒక్క ఓటు ఒక్క పోలింగ్ కేంద్రంలోనే ఉండాలని కేంద్రమంత్రి వ్యాఖ్య
- ప్రింటింగ్ ఎర్రర్ వల్ల ఓటర్ లిస్టులో లోపాలు వచ్చాయని స్పష్టీకరణ
- ఓటర్ జాబితా సవరణలో అందరి బాధ్యత ఉందని కిషన్‌రెడ్డి వ్యాఖ్య
- బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికీ మూడు సార్లు వెళ్లారని వెల్లడి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సర్‌పై రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
- ఓటర్ లిస్టు సరిదిద్దడమే ప్రధాన లక్ష్యమని స్పష్టీకరణ
- పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలని నేతలకు సూచన
- రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల గుర్తింపుపై కీలక వ్యాఖ్యలు
- రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శ







# భారత దౌత్య విజయం

- నెదర్లాండ్స్ నుంచి స్వదేశానికి 11వ శతాబ్దపు 'చోళుల రాగి ఫలకాలు'
- ఢిల్లీ‌ఆమ్‌స్టర్‌డామ్ మధ్య కుదిరిన చారిత్రక ఒప్పందం
- నెదర్లాండ్స్ నుంచి వెనక్కి రానున్న చోళుల కాలం నాటి శాసనాలు
- 14 ఏళ్ల నిరంతర నిరీక్షణకు తెర
- 2012 నుంచి భారత్ చేస్తున్న దౌత్య ప్రయత్నాలకు విజయం
- ప్రధాని మోదీ, డచ్ పీఎం రాబ్ జెట్టెన్ సమక్షంలో వేడుక
- లైడెన్ విశ్వవిద్యాలయం భద్రపరిచిన కళాఖండాల అధికారిక అప్పగింత
- 21 పెద్ద ఫలకాలు, ఒక భారీ కంచు ఉంగరం

-న్యూఢిల్లీ వెలుతురు మే 17:

భారతదేశం అంతర్జాతీయ వేదికపై మరో అద్భుతమైన దౌత్య, సాంస్కృతిక విజయాన్ని సాధించింది. మన దేశ చరిత్రకు, ప్రాచీన సంస్కృతికి అద్దం పట్టే 11వ శతాబ్దానికి చెందిన చారిత్రక 'చోళ రాగి ఫలకాలను' నెదర్లాండ్స్ ప్రభుత్వం భారతదేశానికి అప్పగించేందుకు అంగీకరించింది. నెదర్లాండ్స్‌లో అధికారిక పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, డచ్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో శనివారం జరిగిన ఒక ఉన్నత స్థాయి కార్యక్రమంలో ఈ కళాఖండాలను అధికారికంగా భారత్‌కు బదిలీ చేశారు. ఈ చారిత్రక సంపదను తిరిగి అప్పగించినందుకు నెదర్లాండ్స్ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా 19వ శతాబ్దం మధ్యకాలం నుంచి ఈ అసాధారణమైన రాగి ఫలకాలను ఏమాత్రం పాడవకుండా అత్యంత జాగ్రత్తగా భద్రపరిచిన అక్కడి ప్రసిద్ధ లైడెన్ విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని ఆయన ప్రశంసించారు. ఈ పరిణామం భారత్‌నెదర్లాండ్స్ మధ్య రోజురోజుకూ బలపడుతున్న వ్యూహాత్మక, సాంస్కృతిక సంబంధాలకు ఒక బలమైన నిదర్శనంగా నిలిచింది.

**ప్రతి భారతీయుడు గర్వించదగ్గ క్షణం: ప్రధాని మోదీ**

మన దేశ పురాతన వారసత్వ సంపదను తిరిగి పొందడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రతి భారతీయుడికి ఇది ఎంతగానో ఆనందించాల్సిన సమయం. 11వ శతాబ్దానికి చెందిన చోళుల కాలం నాటి రాగి ఫలకాలు నెదర్లాండ్స్ నుంచి తిరిగి భారత దేశానికి వస్తున్నాయి. డచ్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో జరిగిన ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వామిని కావడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది. ఈ చోళుల రాగి ఫలకాలలో 21 పెద్ద ఫలకాలు, 3 చిన్న ఫలకాలు ఉన్నాయి. వీటిపై ప్రపంచంలోని అత్యంత ప్రాచీన, అందమైన భాషల్లో ఒకటైన తమిళంలో రాసిన నిగూఢ రచనలు ఉన్నాయి. గొప్ప చోళ చక్రవర్తి అయిన మొదటి రాజేంద్ర చోళుడు.. తన తండ్రి, మొదటి రాజరాజ చక్రవర్తి

..మిగతా 2లో




## జూన్ 12 నుంచి వితంతువులకు కొత్త పింఛన్లు

- మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహణ
- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన రాష్ట్ర మంత్రి
- వితంతువులకు కొత్త పింఛన్లు జూన్ 12 నుంచి ప్రారంభం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు అవకాశం త్వరలో అందుబాటులోకి



## నేటి నుంచే 'పర్యాటక వారోత్సవాలు'!

- 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'తో పర్యాటక రంగానికి సరికొత్త కళ
- పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

2

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తొలి సమావేశం

- కేశవరావు నేతృత్వంలో కీలక సమావేశం నిర్వహణ
- అమరవీరుల జ్యోతి కింద కమిటీ కార్యాలయం ఏర్పాటు నిర్ణయం
- ఉద్యమకారుల గుర్తింపుకు నాలుగు కేటగిరీల ప్రతిపాదనలు సిద్ధం
- అమరవీరులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ నిర్ణయం
- ఉద్యమంలో గాయపడిన వారికి రెండో కేటగిరీ ప్రతిపాదన

హైదరాబాద్ వెలుతురు మే 17:

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం చైర్మన్ కేశవరావు నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

..మిగతా 02లో



## నేటి నుండి క్రీడా మరియు యువజన వారోత్సవాలు




## డచ్ ప్రధాని ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

- మాది 140 కోట్ల మంది ఆశల 'సజీవ ప్రజాస్వామ్యం'
- నెదర్లాండ్స్ పీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన విదేశాంగ శాఖ
- పత్రికా స్వేచ్ఛ, మైనారిటీలపై ఆరోపణలు ముమ్మాటికీ తప్పని వెల్లడి
- డచ్ ప్రధానికి అవగాహన లోపమన్న కార్యదర్శి సిబి జార్జ్




## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

- యూనిట్–3లో ఎగిసిపడుతున్న భారీ మంటలు
- పరిసర ప్రాంతాలను కమ్మేసిన దట్టమైన పొగ
- హుటాహుటిన ఘటన స్థలానికి చేరిన అగ్నిమాపక సిబ్బంది
- మంటల నియంత్రణకు తీవ్ర ప్రయత్నాలు
- షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని ప్రాథమిక సమాచారం




## తెలంగాణను వణికిస్తున్న భానుడి భగభగలు

- రాబోయే 5 రోజులు అత్యంత కీలకం
- వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' హెచ్చరికలు
- ఐదు జిల్లాల్లో తీవ్ర స్థాయిలో ఎండలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు



# వేదపాఠశాల శంకుస్థాపనకు రండి

**(మొదటి పేజీ తరువాయి)**
ఆహ్వాన కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవాని శంకర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద విద్యా అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనులు, వేద పాఠశాల ఏర్పాటు ద్వారా ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత ప్రాధాన్యం పొందనుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# నేటి నుంచే 'పర్యాటక వారోత్సవాలు'!

హైదరాబాద్, వెలుతురు మే 17:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను, పర్యాటక శోభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'*లో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో... భాషా సాంస్కృతిక, పురావస్తు (హెరిటేజ్) శాఖలు, నిథమ్ (NITHM) సంస్థల సంయుక్త సమన్వయంతో ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. వారోత్సవాల ప్రారంభం సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

**ఉదయం 10:00 గంటలకు:**
జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (SIHM)లో అడ్మిషన్లు, కెరీర్ గైడెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

**మధ్యాహ్నం 4:00 గంటలకు:**
అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని 'స్టేట్ మ్యూజియం'లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు.ఇదే వేదికపై కొలనుపాక సైట్ మ్యూజియం, అలంపూర్ సైట్ మ్యూజియం ప్రత్యేక బ్రోషర్లతో పాటు, 'టూరిస్ట్ గైడ్ ఇన్ తెలంగాణ' పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరిస్తారు.

**వారోత్సవాల ముఖ్య ఉద్దేశం.. కార్యకలాపాలు**
తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యం. ఎకోటూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయడంతో పాటు, పర్యాటక రంగం ద్వారా యువతకు లభించే ఉపాధి అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు.

**వారోత్సవాల ప్రత్యేక ఆకర్షణలు**
హెరిటేజ్ వాక్‌లు: చారిత్రక కట్టడాల ప్రాశస్త్యాన్ని వివరించేలా ప్రత్యేక కార్యక్రమాలు.
స్వచ్ఛత కార్యక్రమాలు: ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత డ్రైవ్‌లు.
డిజిటల్ ప్రచారం: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లతో ప్రత్యేక కార్యక్రమాలు.

# సర్ పై బీజేపీ, బీఆర్ఎస్ విష ప్రచారం

హైదరాబాద్ వెలుతురు మే 17:

సర్ అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఒక్కరికి ఒక్క ఓటు ఒక్క పోలింగ్ కేంద్రంలో మాత్రమే ఉండాలని స్పష్టం చేసిన ఆయన, ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై అనవసర ఆరోపణలు చేయడం సరి కాదని అన్నారు.ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, తెలంగాణలో సర్ షెడ్యూల్ ప్రకారం ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. ప్రింటింగ్ ఎర్రర్ కారణంగా కొందరి పేర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల కనిపించవచ్చని, కానీ వాటిని సరిదిద్దే ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. ఓటర్ లిస్టు సరిచేయడం అందరి బాధ్యత అని పేర్కొన్న ఆయన, బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి మూడు సార్లు వెళ్లి వివరాలు పరిశీలిస్తారని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని తాము వ్యక్తిగతంగా తప్పుపట్టడం లేదని, కానీ ఓటర్ జాబితా విషయంలో అపోహలు సృష్టించడం సరైంది కాదని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఎలక్షన్ కమిషన్‌పై బురద జల్లుతున్నారని విమర్శించిన ఆయన, సర్‌లో ఎక్కడ కుట్ర జరుగుతోందో స్పష్టంగా చెప్పాలని ప్రశ్నించారు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల అంశాన్ని ప్రస్తావిస్తూ, అక్రమంగా ఉన్నవారిని గుర్తించి తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు.

# డచ్ ప్రధాని ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

ఢిల్లీ వెలుతురు మే 17:

భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ క్షీణిస్తోందని, మతపరమైన మైనారిటీల హక్కులు హరించుకుపోతున్నాయంటూ నెదర్లాండ్స్ (డచ్) ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ చేసిన ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. భారత్ తన దేశ పౌరులందరికీ సంపూర్ణ వాక్ స్వాతంత్ర్యాన్ని, సమాన హక్కులను కల్పించిన ఒక గొప్ప 'సజీవ ప్రజాస్వామ్య దేశం' అని గట్టిగా స్పష్టం చేసింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెదర్లాండ్స్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకున్న తరుణంలో ఈ వివాదం రేగింది. పర్యటన వివరాలను అంతర్జాతీయ మీడియాతో పంచుకునే సమయంలో డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్ భారత్‌లో భావప్రకటనా స్వేచ్ఛ తగ్గుతోందంటూ విమర్శలు గుప్పించారు. దీనిపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) కార్యదర్శి (వెస్ట్) సిబి జార్జ్ వెంటనే స్పందిస్తూ డచ్ ప్రధానికి ఘాటుగా, హేతుబద్ధంగా సమాధానం ఇచ్చారు.

అవగాహన లోపంతోనే ఆరోపణలు:

**సిబి జార్జ్**
డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్ చేసిన విమర్శలను భారత విదేశాంగ శాఖ పూర్తిగా తోసిపుచ్చింది. విదేశాంగ శాఖ కార్యదర్శి సిబి జార్జ్ మాట్లాడుతూ, "భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ, ఇక్కడి మైనారిటీల హక్కుల రక్షణ గురించి డచ్ ప్రధానమంత్రికి సరైన అవగాహన లేదని స్పష్టమవుతోంది. ఆయనకు ఉన్న అవగాహన లోపం వల్లే మేము ఈ రోజు అంతర్జాతీయ వేదికపై ఈ ప్రశ్నను ఎదుర్కోవాల్సి వచ్చింది. భారతదేశం అంటే చిన్న దేశం కాదు, అది 1.4 బిలియన్ల (140 కోట్లు) జనాభా కలిగిన దేశం. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మాది. అంతేకాదు, ఇది 5 వేల సంవత్సరాల సుదీర్ఘ, పురాతన నాగరికత కలిగిన గొప్ప దేశం" అని డచ్ ప్రధాని వ్యాఖ్యలను తిప్పికొట్టారు.

# ఢిల్లీలో వర్క్ ఫ్రమ్ హోం

ఢిల్లీ వెలుతురు మే 17:

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఇంధన వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ప్రజలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంధన పొదుపు చర్యలపై దృష్టి సారించిన దిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. దిల్లీలో ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రైవేటు కంపెనీలు, సంస్థలు వారంలో రెండు రోజుల పాటు వర్క్ ఫ్రమ్ హోమ్ (WFH) విధానాన్ని అమలు చేయాలని దిల్లీ కార్మికశాఖ సూచించింది. అలాగే ఆఫీస్ సమయాల్లో మార్పులు చేసుకోవాలని, ఉద్యోగులు కార్‌పూలింగ్ విధానాన్ని అనుసరించాలని స్పష్టమైన సూచనలు జారీ చేసింది.ఈ మేరకు ఆదివారం దిల్లీ కార్మికశాఖ అధికారికంగా అడ్వైజరీ విడుదల చేసింది. రోజువారీగా పెద్ద ఎత్తున ఇంధన వినియోగానికి ఆఫీస్‌లకు ఉద్యోగుల రాకపోకలే ప్రధాన కారణమని ప్రభుత్వం భావిస్తోంది. ఇంటి నుంచే పని చేసే అవకాశాన్ని పెంచితే ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తాజా సూచనల్లో పేర్కొంది.ఉద్యోగులు వ్యక్తిగ వాహనాల బదులు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించాలని, అలాగే కార్‌పూలింగ్ పద్ధతిని ప్రోత్సహించాలని ప్రభుత్వం సూచించింది. అంతేకాకుండా సమావేశాలు సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించడం ద్వారా ప్రయాణ ఖర్చులు, ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొంది.
అయితే ఆసుపత్రులు, వైద్య, ఆరోగ్య సంస్థలు, విద్యుత్, నీరు, పారిశుద్ధ్యం, మున్సిపల్ వంటి అత్యవసర సేవా రంగాలకు ఈ మార్గదర్శకాలు వర్తించవని దిల్లీ కార్మికశాఖ స్పష్టం చేసింది.

# జూన్ 12 నుంచి వితంతువులకు కొత్త పింఛన్లు

శ్రీకాకుళం జిల్లా వెలుతురు మే 17:

ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా పలు సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ నుంచి వితంతువులకు కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. అర్హులైన లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ సౌకర్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా పింఛన్ దరఖాస్తులను త్వరలోనే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. దీని ద్వారా పారదర్శకత పెరగడంతో పాటు ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయని అన్నారు. రెవెన్యూ సమస్యలపై మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యం కారణంగానే అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. భూమి సంబంధిత సమస్యలు, రికార్డుల లోపాలు వంటి అంశాలను సమీక్షించి త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించారు.ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం లేకుండా పనిచేయాలని అధికారులకు సూచించారు.

# తెలంగాణను వణికిస్తున్న భానుడి భగభగలు

హైదరాబాద్ వెలుతురు మే 17:

తెలంగాణ రాష్ట్రంలో ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరింత తీవ్రరూపం దాల్చనున్నాయని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ (IMD) హెచ్చరించింది. భానుడి ఉగ్రరూపానికి తోడు తీవ్రమైన వడగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ముఖ్యంగా ఐదు జిల్లాల్లో ఎండ తీవ్రత ఊహించని స్థాయిలో ఉండబోతోందని వాతావరణ కేంద్రం ప్రత్యేక అలర్ట్ జారీ చేసింది.

**ఐదు జిల్లాలకు 'రెడ్ అలర్ట్'.. 45 డిగ్రీలు దాటనున్న ఉష్ణోగ్రతలు**
రాష్ట్రంలో రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత సరికొత్త రికార్డులను నమోదు చేసే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎండ తీవ్రత మరియు వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉండే ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలకు వాతావరణ శాఖ అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. రేపటి నుండి నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కూడా పరిస్థితి తీవ్రంగా మారనుందని, ఇక్కడ పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.
రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో ఎండల తీవ్రత సాధారణం కంటే చాలా ఎక్కువగా ఉండబోతోంది. ఇవాళ మరియు సోమవారం నాడు రాష్ట్రంలోని దాదాపు 16 నుండి 20 జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుండి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు హైదరాబాద్, మేడ్చల్‌మాల్కాజిగిరి, కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు.ఒకవైపు ఎండలు మండుతుండగానే, మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన గాలి విచ్ఛిన్నతి కారణంగా రాష్ట్రంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీని ప్రభావంతో ఇవాళ పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడే సూచనలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రాకూడదని వైద్యులు సూచిస్తున్నారు. ఒకవేళ అనివార్య కారణాల వల్ల ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే, తప్పనిసరిగా టోపీ ధరించడం లేదా తెల్లటి టవల్‌ను తలకు కట్టుకోవడం చేయాలి. ముక్కు, చెవుల ద్వారా వేడి గాలి (వడగాలి) శరీరంలోకి ప్రవేశించకుండా ముఖానికి కర్చీఫ్ కట్టుకోవాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అలాగే శరీరానికి గాలి తగిలేలా ఉండే తేలికపాటి నూలు (కాటన్) వస్త్రాలను ధరించడం ఉత్తమం.ఈ వాతావరణ పరిస్థితులు అందరిపై ప్రభావం చూపినప్పటికీ, కొందరికి వడదెబ్బ తగిలే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో (గుండె జబ్బులు, మధుమేహం వంటివి) సతమతమవుతున్న వారు మధ్యాహ్నం వేళల్లో అస్సలు బయటకు రాకూడదు. ఇంట్లోనే ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఏమాత్రం అస్వస్థతగా అనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.పట్టణాలు, గ్రామాల్లో రేకుల ఇళ్లలో నివసించే వారికి ఎండ వేడిమి నేరుగా తాకుతుంది. వేడి గాలులు ఇళ్లలోకి రావడం వల్ల గది ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగుతుంది. ఇలాంటి ఇళ్లలో ఉండేవారు వేడిని తగ్గించుకోవడానికి ఇంటి రేకులపై ఎండుగడ్డిని లేదా జనపనార (గోనె) సంచులను పరిచి, వాటిపై క్రమం తప్పకుండా నీళ్లు చల్లుతూ తడపాలి. దీనివల్ల ఇళ్లలోకి వచ్చే వేడి తీవ్రతను కొంతవరకు తగ్గించుకోవచ్చు.
అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరానికి విపరీతంగా చెమట పడుతుంది. దీనివల్ల శరీరంలోని నీటి శాతంతో పాటు అత్యంత కీలకమైన ఎలక్ట్రోలైట్స్ (లవణాలు) హరించుకుపోతాయి. ఫలితంగా తీవ్రమైన అలసట, నీరసం మరియు అస్వస్థత కలుగుతాయి. కాబట్టి దాహం వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీరు తాగుతూ ఉండాలి. సాధారణ నీటితో పాటు కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, లేదా నిమ్మరసంలో కొద్దిగా ఉప్పు, చక్కెర కలిపి తీసుకోవడం ద్వారా శరీరాన్ని డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఎవరైనా ఎండ తీవ్రతకు గురై సొమ్మసిల్లిపోతే (వడదెబ్బ తగిలితే) వెంటనే వారిని నీడగా ఉన్న చల్లని ప్రదేశానికి తరలించాలి. బాధితుడి తల నుండి కాళ్ల వరకు తడి గుడ్డతో పూర్తిగా తుడుస్తూ శరీరాన్ని చల్లబరచాలి. గదిలో గాలి ధారాళంగా ఆడేలా చూడాలి. బాధితుడు కాస్త తేరుకున్న తర్వాత ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించి, వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి. ముఖ్యంగా వడదెబ్బతో పాటు వాంతులు, విరేచనాల లక్షణాలు ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్యం అందించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

# భారత దౌత్య విజయం

**(మొదటి పేజీ తరువాయి)**
ఇచ్చిన మౌఖిక వాగ్దానాన్ని అధికారికంగా నెరవేర్చడానికి సంబంధించిన వివరాలు ఈ ఫలకాలపై చెక్కబడి ఉన్నాయి. ఇవి చోళ సామ్రాజ్య వైభవాన్ని, వారి పరిపాలనా దక్షతను చాటిచెబుతాయి. భారతదేశ చరిత్రలో చోళ రాజులు, వారి విశిష్ట సంస్కృతి, వారి సముద్రయాన పరాక్రమం పట్ల మనమంతా ఎంతో గర్వపడుతున్నాం" అని ప్రధాని అన్నారు.

**14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలించింది**
ఈ ప్రాచీన రాగి శాసనాలను నెదర్లాండ్స్‌లో 'లైడెన్ ఫలకాలు' అని పిలుస్తుండగా, భారతదేశంలో వీటిని 'అనైమంగళం రాగి ఫలకాలు'గా పిలుస్తారు. మన దేశానికి చెందిన ఈ చారిత్రక ఆధారాలను తిరిగి స్వదేశానికి తీసుకురావాలని భారతదేశం 2012వ సంవత్సరం నుంచి నిరంతరాయంగా, అవిశ్రాంతంగా ప్రయత్నిస్తోంది. ఎట్టకేలకు ఇప్పటికి ఆ ప్రయత్నాలు ఫలించాయి. సుమారు 30 కిలోగ్రాముల బరువున్న ఈ 21 రాగి ఫలకాలు, చోళ సామ్రాజ్య అధికారిక రాజముద్రను కలిగిన ఒక భారీ కంచు ఉంగరంతో అనుసంధానించబడి ఉన్నాయి. భారత సరిహద్దుల వెలుపల చోళ రాజవంశానికి సంబంధించిన ఉనికిని చాటే అత్యంత కీలకమైన, బలమైన ఆధారాల్లో ఇది ఒకటిగా చరిత్రకారులు భావిస్తారు. ఈ ఫలకాలపై ఉన్న గ్రంథాలు సంస్కృతం, తమిళం రెండు భాషల్లోనూ లిఖించబడ్డాయి. బ్రిటీష్ కాలంలో లేదా అంతకుముందు వివిధ దేశాలు భారతదేశం నుండి దొంగిలించిన, తరలించిన మన సాంస్కృతిక వారసత్వ సంపదను తిరిగి పొందే విషయంలో భారత్ ప్రస్తుతం అంతర్జాతీయంగా సాధిస్తున్న వరుస విజయాల పరంపరలో ఇది మరొక మైలురాయిగా నిలిచింది.

**వ్యూహాత్మక భాగస్వామ్యం వైపు అడుగులు.. 17 ఒప్పందాలు**
కళాఖండాల అప్పగింతతో పాటు, భారత్‌నెదర్లాండ్స్ దేశాలు తమ ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నతమైన వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయి. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, ఆ దేశ ప్రధాని రాబ్ జెట్టెన్ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగాయి. ఇరు దేశాల రక్షణ రంగ బలోపేతం, భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే కీలక ఖనిజాల (క్రిటికల్ మినరల్స్) సరఫరా, సాంకేతికత, వాణిజ్యం వంటి విభిన్న రంగాల్లో కలిపి ఇరు దేశాలు మొత్తం 17 కీలక ఒప్పందాలపై అధికారికంగా సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాలు రాబోయే కాలంలో రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలను, పారిశ్రామిక రంగాన్ని మరింత ముందుకు నడిపిస్తాయని ఇరు నేతలు ధీమా వ్యక్తం చేశారు.

**గ్లోబల్ ఎనర్జీ సంక్షోభంపై సమాలోచనలు**
ఇరు దేశాల అధినేతల మధ్య జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కేవలం ద్వైపాక్షిక అంశాలే కాకుండా అంతర్జాతీయ పరిణామాలపై కూడా సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ముఖ్యంగా ప్రస్తుత పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఇరు ప్రధానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ జరుగుతున్న ఘర్షణల వల్ల గ్లోబల్ ఎనర్జీ (చమురు, గ్యాస్)

# కొలువు దీరనున్న కేరళ కొత్త ప్రభుత్వం

కేరళం వెలుతురు మే 17:

కేరళలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎఫ్ కూటమి ఘన విజయం సాధించడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ విపక్ష నేత వీడీ సతీశన్ మే 18వ తేదీన అధికారికంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు మరో 20 మంది క్యాబినెట్ మంత్రులు కూడా అదే రోజున పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన మంత్రివర్గ జాబితాను వీడీ సతీశన్ ఆదివారం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన లోక్‌భవన్‌కు వెళ్లి అధికారిక ప్రక్రియను పూర్తి చేశారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కీలక నేతలకు చోటు దక్కింది. రమేష్ చెన్నితాల, కె. మురళీధరన్, కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జెసెఫ్ సహా పలువురు సీనియర్ నేతలు మంత్రులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. పార్టీ అనుభవం, ప్రాంతీయ సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని మంత్రివర్గాన్ని రూపొందించినట్లు సమాచారం.
అసెంబ్లీ స్పీకర్‌గా సీనియర్ కాంగ్రెస్ నేత తిరువాంచూర్ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయగా, డిప్యూటీ స్పీకర్‌గా షానిమోల్ ఉస్మాన్‌ను నియమించారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపేందుకు అనుభవజ్ఞులైన నేతలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. కేరళ కొత్త ముఖ్యమంత్రి ఎంపికపై గత కొద్ది రోజులుగా కొనసాగిన సస్పెన్స్‌కు ఇటీవల తెరపడింది. కేసీ వేణుగోపాల్, వీడీ సతీశన్, రమేష్ చెన్నితాల పేర్లు అధిష్టానం పరిశీలనలో ఉన్నప్పటికీ, చివరికి కాంగ్రెస్ హైకమాండ్ సతీశన్ వైపు మొగ్గు చూపింది. మే 14న ఆయనను సీఎల్పీ నేతగా, తదుపరి ముఖ్యమంత్రిగా ఏఐసీసీ అధికారికంగా ప్రకటించింది.ఇటీవల జరిగిన ఎన్నికల్లో యూడీఎఫ్ కూటమి భారీ విజయం సాధించింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాల్లో 102 స్థానాలను గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించింది. అధికార ఎల్‌డీఎఫ్ కూటమి 35 సీట్లకే పరిమితమైంది. బీజేపీ మాత్రం 3 స్థానాల్లో విజయం సాధించింది.ఈ ఫలితాలతో కేరళ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. యూడీఎఫ్ ఘన విజయంతో రాష్ట్రంలో కొత్త పాలనా దిశ ప్రారంభమవుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి, సంక్షేమం, పాలనా పారదర్శకతపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించనుందని భావిస్తున్నారు.మే 18న జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమం కేరళ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా నిలవనుంది. పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు సమాచారం. కొత్త ప్రభుత్వంపై ప్రజల్లో భారీ ఆశలు నెలకొన్నాయి.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తొలి సమావేశం

**(మొదటి పేజీ తరువాయి)**
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు అధికారికంగా కమిటీ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని సభ్యులు పేర్కొన్నారు.సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరవీరుల జ్యోతి కింద ఉన్న కార్యాలయంలోనే తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే అమరవీరుల గుర్తింపు, ఉద్యమకారుల ఎంపికపై విస్తృత చర్చ జరిపేందుకు త్వరలో ఆల్‌పార్టీ సమావేశం నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. ఆ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు తీసుకోవాలని భావిస్తోంది. ఇక తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, 1969 ఉద్యమకారులు, ఉద్యోగ సంఘాలు, కళాకారుల జేఏసీ, సబ్బండ వర్గాల జేఏసీ, కుల సంఘాలు, న్యాయవాదుల జేఏసీతో పాటు జిల్లాల వారీగా ఏర్పడిన వివిధ ఉద్యమ సంఘాల నుంచి కూడా ప్రతిపాదనలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన పౌరసమాజ ప్రతినిధుల అభిప్రాయాలను కూడా సేకరించనున్నారు.

# నేటి నుండి క్రీడా మరియు యువజన వారోత్సవాలు

హైదరాబాద్ వెలుతురు మే 17:

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న యువజన మరియు క్రీడా వారోత్సవాలు కార్యక్రమాన్ని రేపు ఉదయం 6 గంటలకు ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ లో గౌరవ క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గారు బీసీ మరియు రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్,స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి ప్రభుత్ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ లతో కలిపి ప్రారంభిస్తారు నేటి ఉదయం టెన్నిస్ కాంప్లెక్స్ లో ఉదయం 6 గంటలకు మెగా జుంబా కార్యక్రమం ఆ తదుపరి ఐదు కిలోమీటర్ల వక్ థాన్ కార్యక్రమాము మరియు ఎల్బీ ఇండోర్ స్టేడియంలో జరిగే యోగ మెడిటేషన్ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొంటారు ఎల్ బి టెన్నిస్ కాంప్లెక్స్ వద్ద మంత్రులు వాకిటి శ్రీహరి పొన్నం ప్రభాకర్లు జండా ఊపి ప్రారంభించే వాకథాన్ కార్యక్రమంలో దాదాపు 2000 పైగా యువ క్రీడాకారులు పాల్గొని 5కే వాకతాన్ కార్యక్రమం ఎల్బీ స్టేడియం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం బురుగుల రామకృష్ణారావు భవనం ఈగల్ సర్కిల్ ఆర్బీఐ అసెంబ్లీ కంట్రోల్ రూమ్ మీదుగా ఎల్బీ ఇండోర్ స్టేడియం వరకు కొనసాగుతుంది. తదుపరి ఎల్బి ఇండోర్ స్టేడియంలో దివ్యాంగులకు మహిళలకు సీనియర్ సిటిజన్స్ కు యోగ మెడిటేషన్ కార్యక్రమం నిర్వహింపబడుతుంది.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

నల్లగొండ జిల్లా వెలుతురు మే 17:

నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం ప్రాంతంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పవర్ ప్లాంట్‌లోని యూనిట్ -3లో ఒక్కసారిగా భారీగా మంటలు ఎగిసిపడటంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది. మంటల తీవ్రతతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే దీనిపై అధికారిక నిర్ధారణ ఇంకా రావాల్సి ఉంది.పవర్ ప్లాంట్‌లోని సిబ్బంది అప్రమత్తమై భద్రతా చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, నష్టం అంచనా ఇంకా తెలియాల్సి ఉంది.



# ఈఏపీసెట్–2026లో ప్రభంజనం సృష్టించిన సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థులు

- **అగ్రికల్చర్, మెడిసిన్ విభాగాల్లో సోషల్ వెల్ఫేర్ గురుకులాల సత్తా**
- **పేద కుటుంబాల తల్లిదండ్రుల ఆశయాలకు విద్యతో బలమైన పునాది వేసిన గురుకుల వ్యవస్థ**

హైదరాబాద్ వెలుతురు మే 17:

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (TGSWREIS) గురుకుల విద్యార్థులు ఈఏపీసెట్-2026 ఫలితాల్లో మరోసారి అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు.

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (TGSWREIS) ఆధ్వర్యంలో నడుస్తున్న కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ (COE's) విద్యార్థులు వ్యవసాయం మరియు మెడిసిన్ విభాగాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి గురుకులాల విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు హర్షం వ్యక్తం చేస్తూ....పేద, దళిత , గిరిజనులు గిరిజన,బడుగు వర్గాలకు చెందిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి తెలంగాణ గురుకులలో ఒక నూతన విద్యా విప్లవానికి నాందిగా నిలిచారని చెప్పేందుకు ఈ ఫలితాలే నిదర్శనమన్నారు.

"అవకాశం కల్పిస్తే సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు కూడా అద్భుతాలు సృష్టించగలరని గ మరోసారి నిరూపించారు" అని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి సహకారంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు, ప్రత్యేక కోచింగ్, డిజిటల్ లెర్నింగ్, పోటీ పరీక్షల శిక్షణ వంటి అనేక కార్యక్రమాలు అమలకు ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తు చేస్తున్నరని తెలిపారు.

ఈ విజయాల వెనుక తల్లిదండ్రుల త్యాగం, విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల నిరంతర కృషి ప్రధాన కారణమని మంత్రి స్పష్టం చేశారు.

ఆర్థిక ఇబ్బందులు, గ్రామీణ నేపథ్యం వంటి ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ విద్యార్థులు సాధించిన ఫలితాలు సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు.

TGSWREIS కార్యదర్శి(FAC) శ్రీమతి కంభంపాటి శారద గారు మాట్లాడుతూ...ఈ విద్యా సంవత్సరంలో ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, జేఈఈ, నీట్ మరియు ఈఏపీసెట్ వంటి ప్రధాన పరీక్షల్లో గురుకుల విద్యార్థులు వరుస విజయాలు నమోదు చేయడం సంస్థ విద్యా నాణ్యతకు నిదర్శనమన్నారు.


విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి వారికి లక్ష్యాధారిత శిక్షణ అందించేందుకు అకాడమిక్ మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేసినట్లు తెలిపారు.

రెగ్యులర్ గ్రాండ్ టెస్టులు, డైలీ ప్రాక్టీస్ సెషన్లు, ప్రత్యేక స్టడీ అవర్స్, సబ్జెక్ట్‌వైజ్ మెంటరింగ్, సందేహ నివృత్తి తరగతులు, నిపుణులతో ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు.

ప్రత్యేకించి బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ అధ్యాపకులు విద్యార్థుల విజయాల కోసం ఉదయం నుంచి రాత్రి వరకు అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించేలా విద్యార్థులకు మానసిక ధైర్యం, ప్రేరణ అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించారని ఆమె పేర్కొన్నారు.

అలాగే పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు గురుకులాలపై ఉంచిన విశ్వాసం ఈ విజయాలతో మరింత బలపడిందన్నారు. గురుకులాల్లో అందుతున్న నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, భద్రత, పోటీ పరీక్షల దిశగా ప్రత్యేక శిక్షణ కారణంగా పేద కుటుంబాల విద్యార్థులు దేశ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని ఆమె తెలిపారు.

ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, ప్రిన్సిపాళ్లకు మరియు అకాడమిక్ బృందాలకు TGSWREIS కార్యదర్శి (FAC) శ్రీమతి కంభంపాటి శారద గారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా గురుకుల సంస్థ సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతుందని ఆమె స్పష్టం చేశారు.




# ప్రపంచ యుద్ధాలు కంట్రోల్ చేస్తాననే మోదీ...

- **సొంత దేశంలో ప్రశ్నాపత్రాలను కూడా కాపాడలేకపోవడం హాస్యాస్పదం!**
- **డా. రేఖ బోయలపల్లి, ఉపాధ్యక్షురాలు, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**
- **"89 పేపర్ లీకులు... 2 కోట్ల యువత భవిష్యత్తు చీకట్లో — ఇదేనా మోదీ గారి 'వికసిత భారత్'?"**

హైదరాబాద్ వెలుతురు మే 17:

దేశ యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం ప్రచార రాజకీయాల్లో మునిగిపోయిందని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

"ప్రపంచ యుద్ధాలు ఆపుతానంటూ అంతర్జాతీయ వేదికలపై గొప్పలు చెప్పుకునే ప్రధాన మంత్రి మోదీ గారు... సొంత దేశంలో పేపర్ లీకేజీలను ఎందుకు ఆపలేకపోతున్నారు?" అని ఆమె ప్రశ్నించారు.

2014 తర్వాత దేశవ్యాప్తంగా సుమారు 89 ప్రధాన పేపర్ లీక్ ఘటనలు, 19 రాష్ట్రాల్లో పరీక్షా అవకతవకలు, దాదాపు 2 కోట్ల మంది అభ్యర్థులు ప్రభావితమైన పరిస్థితి దేశ విద్యా మరియు నియామక వ్యవస్థలపై తీవ్రమైన అనుమానాలను సృష్టించిందని ఆమె పేర్కొన్నారు.

NEET, UGCNET, SSC, Railways, Police Recruitments, State Public Service Commissions వంటి కీలక పరీక్షలు వరుసగా లీక్‌లు, రద్దులు, కోర్టు వివాదాలతో వార్తల్లో నిలుస్తుండటం యువతలో తీవ్ర నిరాశ కలిగిస్తోందన్నారు.

దేశంలో నిరుద్యోగం 45 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరిందని అనేక ఆర్థిక నివేదికలు చెబుతున్న సమయంలో... ఉద్యోగాల కోసం సంవత్సరాల పాటు కష్టపడే యువతకు చివరికి దక్కేది లీకైన ప్రశ్నాపత్రాలు మాత్రమేనా? అని ప్రశ్నించారు.

"14 గంటలు చదివే విద్యార్థి... వేల రూపాయలు ఖర్చు చేసే మధ్యతరగతి కుటుంబం... చివరకు Exam Mafia చేతిలో మోసపోవడం ఈ దేశానికి అవమానం" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

"Digital India", "Viksit Bharat" అంటూ దేశానికి కలలు చూపించే ప్రభుత్వం... ఒక Question Paperను కూడా రక్షించలేకపోతే, దేశ భవిష్యత్తును ఎ కాపాడుతుంది?" అని ఆమె నిలదీశారు.

2024లో కేంద్ర ప్రభుత్వం AntiPaper Leak చట్టం తీసుకొచ్చినప్పటికీ, నేలమీద మాత్రం Exam Mafia మరింత బలపడుతోందని ఆమె ఆరోపించారు. ప్రతి లీక్ తర్వాత చిన్న స్థాయి అధికారుల సస్పెన్షన్‌తో సరిపెట్టకుండా, అసలు మాఫియా నెట్‌వర్క్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**డా. రేఖ బోయలపల్లి కేంద్ర ప్రభుత్వానికి ఈ క్రింది డిమాండ్లు చేశారు:**

- NationalLevel Secure Digital Examination సిస్టం
- NTA వంటి సంస్థలపై స్వతంత్ర విచారణ
- Exam Mafiaపై FastTrack Courts ద్వారా విచారణ
- Paper Leak కేసుల్లో జీవితకాల నిషేధం
- TimeBound Recruitment క్యాలెండర్
- ప్రభావిత విద్యార్థులకు న్యాయం మరియు పరిహారం



"Merit వ్యవస్థ కూలిపోతే దేశ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుంది. లీకైన ప్రశ్నాపత్రాలు, పగిలిన విద్యార్థుల కలలపై 'వికసిత భారత్' నిర్మించలేరు" అని ఆమె స్పష్టం చేశారు.

## అమెరికాలో నల్గొండ విద్యార్థిని మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



మునుగోడు వెలుతురు మే 17:

నల్గొండ జిల్లా నార్కట్పల్లి మండలం చెరువుగట్టు గ్రామానికి చెందిన గడుసు శ్రీనివాస్ రెడ్డి కూతురు గడుసు నవ్య అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం దిగ్భ్రాంతికి గురి చేసిందని ఈ ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు... అమెరికాలో ఎమ్మెస్ చేయడానికి వెళ్లిన నవ్య ప్రమాదంలో చనిపోవడం ఆ కుటుంబానికి తీరని లోటని విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు...

# గద్వాల విజయలక్ష్మీని అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ వెలుతురు మే 17:

- మినిస్టర్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వక భేటీ
- నూతన బాధ్యతలపై శుభాకాంక్షలు తెలిపిన మంత్రి
- మహిళా సమస్యల పరిష్కారంపై చర్చించిన నేతలు

**సామాజిక న్యాయం, మహిళా సాధికారతపై ప్రాధాన్యం**

ఇటీవల తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన గద్వాల విజయలక్ష్మికి మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా కమిషన్ చైర్మన్‌గా ఆమె సమర్థవంతంగా పనిచేసి మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు.

భేటీ సందర్భంగా రాష్ట్రంలో మహిళల సంక్షేమం, సాధికారత, అలాగే సామాజిక న్యాయం దిశగా తీసుకోవాల్సిన చర్యలపై ఇద్దరి మధ్య స్వల్ప చర్చ జరిగినట్లు సమాచారం. మహిళల భద్రత, హక్కుల పరిరక్షణపై ప్రభుత్వ కట్టుబాటును మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన గద్వాల విజయలక్ష్మీకి పలువురు నేతలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు రేవంత్ రెడ్డికి ఆహ్వానం

- **జూన్ 1 వరకు కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాలు**
- **ఈ నెల 21 నుంచి పుష్కర ఘట్టానికి ప్రారంభం**
- **మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో వేడుకల నిర్వహణ**
- **ముఖ్యమంత్రికి అధికారిక ఆహ్వానం అందజేత**
- **మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ఆహ్వాన బృందం**
- **శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి అర్చకుల పాల్గొనడం**
- **దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల హాజరు**
- **ఎంపీ వేం నరేందర్ రెడ్డి సమావేశంలో పాల్గొనడం**
- **దేవస్థాన అభివృద్ధి, ఏర్పాట్లపై చర్చ**
- **భారీ స్థాయిలో పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు**



హైదరాబాద్ వెలుతురు మే 17:

జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని మంత్రి కొండా సురేఖ కలిసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు అధికారికంగా ఆహ్వానించారు. ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 1 వరకు ఈ పుష్కరాలు కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పుష్కరాల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన సౌకర్యాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

ఆహ్వాన కార్యక్రమంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం ఈవో మహేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# భారత్‌కు చేరిన ఎల్పీజీ నౌక 'సైమి

- కాండ్లా పోర్టులో 20 వేల టన్నుల సరుకు దిగుమతి
- విజయవంతంగా హర్మూజ్ జలసంధిని దాటిన నౌక
- పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య భారత్‌కు ఇంధన రవాణా కొనసాగింపు
- హర్మూజ్ జలసంధి దాటి సురక్షితంగా 'సైమి' నౌక చేరిక
- గుజరాత్ కాండ్లా పోర్టులో ఎల్పీజీ సరుకు దిగుమతి
- ఖతార్ రాస్ లఫాన్ టెర్మినల్ నుంచి బయల్దేరిన నౌక
- సుమారు 20,000 టన్నుల వంటగ్యాస్ రవాణా చేసిన ట్యాంకర్
- మరో ఎల్పీజీ నౌక 'సన్‌షైన్' కూడా హర్మూజ్ దాటి ప్రయాణం
- 46,427 టన్నుల ఎల్పీజీతో న్యూ మంగళూరు వైపు ప్రయాణం
- రెండు నౌకల సరుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందినది
- ఇప్పటి వరకు 13 భారత నౌకలు హర్మూజ్ దాటి సురక్షితంగా ప్రయాణం



ఢిల్లీ వెలుతురు మే 17:

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ ఇంధన రవాణాపై ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ, భారత్‌కు వంటగ్యాస్ సరఫరా విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎల్పీజీని తీసుకొస్తున్న మరో భారత నౌక 'సైమి' (LPG Tanker Symi) హర్మూజ్ జలసంధిని దాటి సురక్షితంగా భారత తీరానికి చేరింది.

ఖతార్‌లోని రాస్ లఫాన్ టెర్మినల్ నుంచి బయల్దేరిన ఈ నౌక ఆదివారం గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు చేరుకుంది. ఈ ట్యాంకర్‌లో సుమారు 20,000 టన్నుల ఎల్పీజీ గ్యాస్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ మార్గాన్ని దాటి భారత్‌కు చేరిన ఈ నౌక రాకతో వంటగ్యాస్ సరఫరా వ్యవస్థకు కొంత ఊరట లభించినట్లు భావిస్తున్నారు.

ఇదే సమయంలో మరో ఎల్పీజీ నౌక 'సన్‌షైన్' కూడా హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటినట్లు నౌకాయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ నౌకలో 46,427 టన్నుల ఎల్పీజీ ఉన్నట్లు వెల్లడించారు. ఇది సోమవారం నాటికి న్యూ మంగళూరు పోర్టుకు చేరుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ రెండు నౌకల్లోని వంటగ్యాస్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (IOC)కు చెందినదిగా అధికారులు స్పష్టం చేశారు.

హర్మూజ్ జలసంధిపై ఆంక్షలు లేదా ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 13 భారత నౌకలు ఈ మార్గాన్ని దాటి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇది భారత ఇంధన సరఫరా వ్యవస్థకు కొంత స్థిరత్వాన్ని అందిస్తున్న అంశంగా పరిగణిస్తున్నారు.

అయితే, మరోవైపు పరిస్థితి పూర్తిగా సాధారణంగా లేదని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం భారత్‌కు ఇంధనం రవాణా చేస్తున్న మరో 12 నౌకలు గల్ఫ్ ప్రాంతంలోనే చిక్కుకుపోయినట్లు సమాచారం. మార్గ భద్రత, సముద్ర పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ఈ నౌకల ప్రయాణం ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.

భారతదేశం తన వంటగ్యాస్ అవసరాల్లో పెద్ద భాగాన్ని దిగుమతుల ద్వారానే పొందుతున్న నేపథ్యంలో, హర్మూజ్ మార్గం అత్యంత కీలకంగా మారింది. ఈ మార్గంలో ఏవైనా అడ్డంకులు ఏర్పడితే దేశీయ ఇంధన సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో నౌకలు సురక్షితంగా చేరుకోవడం తాత్కాలిక ఊరట కలిగించినప్పటికీ, దీర్ఘకాలికంగా సరఫరా వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, నిల్వ సామర్థ్యాల పెంపు అవసరమని నౌకాయాన రంగ నిపుణులు సూచిస్తున్నారు.

మొత్తానికి, 'సైమి' మరియు 'సన్‌షైన్' నౌకల సురక్షిత ప్రయాణం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా మారినప్పటికీ, గల్ఫ్‌లో కొనసాగుతున్న అనిశ్చితి పరిస్థితులు ఇంకా ఆందోళన కలిగిస్తున్నాయి.




## "ఉపమానాలు పేనలేను "

నేను ఉపమానాలు పేనలేను!..
ఉపోద్ఘాతాలు అసలే చెప్పలేను!..
గుండెను పిండలేను!..
మనసును తొలుచలేను!..
అందరిని ఆకర్శించుకోవాలనే ఆశలేదు
ఉన్నతుని అనే చెప్పుకోవాలనే ద్యాసలేదు!..

నాకోసం నావారు ఉంటారు
వారి ద్యాసలో నా విశ్వాసాన్ని విశ్వసిస్తరు!..
రేపటి ఉదయంలో హృదయాన్ని అందిస్త..
నేను ఓ నిశ్శబ్దంలో ఘనీభవిస్తే...
వారి చూపుల ప్రేరణతో ద్రవీభవిస్త..
మధురమైన భావాల కవితనై ప్రవహిస్తా...

ఎప్పుడు నేను ఏకాకినే నాలోనేను ఉన్నప్పుడు
తరువాత నిజమైన కవిత్వ బంధువునే
అప్పుడప్పుడు నా లోకంలోంచి నిశ్శబ్దంగా
మీ లోకంలోకి వలస వస్తుంటాను!.....
మీ ఆత్మీయ తీరాల చుట్టూ ...
నా కవిత్వం అంచును నిలుపుతుంటా!....

నా మనసులోతులో వారే..
నా భావాల లోతులో వీరే..
ఎవరు స్వీకరించినా స్వీకరించకపోయిన
నేను చెప్పేది ఇది నిజం!..
నిత్యం ఎక్కడో ఒకదగ్గర
కన్నీటి గాధలో నా కవిత్వాన్ని తడుపుతుంట!..

మనం సగటు మనుషులం..
మనలో ఏ చాటువులు లేవు
మనబతుకులో ఏదో ఓ సిద్ధాంతం
ఎవరికి తెలువకుండానే లేవనెత్తుతుంది

చాలామందికి తెలువదు.
మన అనుబంధంలో అనుకోని...
అవరోధాలు ఎన్నెన్నో రెచ్చగొడుతుంటాయి!...

మాటలతో మత్తెక్కించే మస్తిష్కాలెన్నో
అప్పుడప్పుడు గుండెల్ని గాయపరుస్తుంటాయి..
మోయలేనంత బాధను మోపుతుంది
సృష్టిస్తుంది లోతుల్ని చూపిస్తుంది లోయల్ని..
అనంత శూన్యంలో పరుగెత్తమంటుంది

అప్పుడే వివిధ పార్శ్వాలతో కూడిన బాహువులు
కవిత్వపు అగ్ని జ్వాలలై లేస్తుంది
రాలే నిప్పురవ్వలై కాల్చేస్తుంది కలతల్ని!..
కూల్చేస్తుంది మానసిక ఒత్తిళ్ళను!..
ఓ ఆకృతి తెస్తుంది ప్రభాతాన్ని...
ఓ అద్భుతం నింపుతుంది వసంతాన్ని...

నా కవితకు గుండె ఉంది నిండైన మనసు ఉంది
అప్పుడప్పుడు క్రోధం పుడుతుంది కోపం తెప్పిస్తుంది
ఆర్ద్రత ఉంది అనురాగం పంచుతుంది
అలక ఉంది ఆలోచింప జేస్తుంది
ప్రేమను పేనుకొనే ప్రాణం ఉంది
ఇంతకన్నా కవిత్వాన్నికి ఏమి ఉండాలి
అందరికొరకై కవిత్వం పుట్టాల్లి
కొందరిని పలుకరిస్తూ పలువరిస్తు ఉండాలి!!...

అంబటి నారాయణ
నిర్మల్
9849326801

# రూ.35 కోట్లతో కాప్ర చెరువు సుందరీకరణకు శ్రీకారం

- **కాప్ర ప్రాంత అభివృద్ధికి మరో మైలురాయి – ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

కాప్ర, మే 17 (వెలుతురు):





కాప్ర ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో కాప్ర చెరువు పునరుద్ధరణ మరియు సుందరీకరణ పనులకు ఆదివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బైరీ నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాప్ర చెరువును నగరంలోనే ఒక ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.35 కోట్ల నిధులను కేటాయించిందని తెలిపారు. చెరువు పరిసర ప్రాంతాలను పచ్చదనంతో అభివృద్ధి చేసి ప్రజలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. చెరువు చుట్టూ ఆధునిక వాకింగ్ ట్రాక్‌లు, అందమైన పార్కులు, అలంకార లైటింగ్, విశ్రాంతి కేంద్రాలు, పచ్చదనం పెంపు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కుటుంబాలతో కలిసి ప్రజలు ప్రశాంతంగా గడిపే విధంగా చెరువు ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నామని చెప్పారు.

కాప్ర ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుందని ఆయన పేర్కొన్నారు. చెరువు అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం కాప్ర చెరువు నగర ప్రజలకు ఒక ఆహ్లాదకరమైన పర్యాటక కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి, గొల్లురి అంజయ్య, పన్నాల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్ రావు, నీలం రెడ్డి, దామోదర్, బి ఎ రాంచందర్ గౌడ్, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై చెరువు అభివృద్ధి పనులకు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు.. ప్రజాసేవలో ముందుండే నాయకుడు..నర్సింగ్ యాదవ్..

కూకట్ పల్లి మే 17 వెలుతురు:



శేర్లింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మారబోయిన రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు రవికుమార్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సింగ్ యాదవ్, సీనియర్ నాయకులు నరసింహ చారి, ఆంజనేయులు యాదవ్, విష్ణు, చాంద్, సురేష్, రాజు, చందు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో మారబోయిన రవికుమార్ యాదవ్ ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తూ ప్రజలకు చేరువైన నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారని కొనియాడారు. ఆయనకు దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల సందర్భంగా కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు నాయకుడిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## సమాజ సేవలోనే సంతృప్తి కలుగుతుంది... రిటైర్డ్ డిఎస్పి విద్యాసాగర్

కూకట్ పల్లి మే 17 వెలుతురు:



ఆదిత్య నగర్ లో సంఘ సేవకులు, గణేష్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ అధినేత సమ్మెట ప్రసాద్ ఆధ్వర్యంలో వేసవికాలం లో దాహార్తిని తీర్చే చలివేంద్రం నిర్వహణ చేపట్టి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రిటైర్డ్ డిఎస్పి విద్యాసాగర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలోనే సంతృప్తి లభిస్తుందన్నారు. సంపాదనలో ఎంతో కొంత సమాజసేవకు వినియోగించడం ద్వారా వారికి ప్రత్యేక గుర్తింపు కూడా లభిస్తుందన్నారు. గత 20 ఏళ్లుగా మండుటెండల్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎందరో దాహార్తిని తీర్చడం అనేది ఒక మహా యజ్ఞం లాంటిదని అభిప్రాయపడ్డారు. మున్ముందు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహణ చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య నగర్ కాలనీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మియాపూర్ కాపు సంఘం నాయకులు సమ్మెట ప్రసాద్, రాయల్ నంద కుమార్ కాలనీ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## దాద్ పల్లి గ్రామంలో వైద్యం వికటించి కాలు కోల్పోయిన సిద్ధగోని కృష్ణయ్య కుటుంబానికి అండగా ఉంటాం

- **దాద్ పల్లి గ్రామ 10వ తరగతి 1993-94బ్యాచ్ విద్యార్థిని విద్యార్థులు ఆర్థిక సహాయం**
- **డిసిసి అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్ వెంకటేష్ గౌడ్**

మంచాల వెలుతురు మే17:



మంచాల మండలం దాద్ పల్లి గ్రామానికి చెందిన సిద్దగోని కృష్ణయ్య వైద్యం వికటించటంతో కాలును తొలగించారు ఆర్థిక పరిస్థితి బాగా లేనందున అనారోగ్యంతో గత కొంతకాలంగా సంవత్సరం నుండి ఇంటి వద్దనే ఉండుకుంటూ జీవనంసాగిస్తున్నాడు ఇట్టి విషయం తెలుసుకున్న దాద్ పల్లి గ్రామానికి చెందిన గ్రామపెద్దలు గ్రామపంచాయతీ సర్పంచ్ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు గ్రామానికి చెందిన పెద్దల సహకారంతో కలిసి 30000మరియు1993 1994బ్యాచ్ పదవ తరగతి విద్యార్థు ల సహచర బాధిత కుటుంబానికి 25000 వేల రూపాయలు మొత్తం 55000 ఆర్థిక సాయం కృష్ణ య్య కుటుంబానికి అందచేశారు ఈసందర్భంగా పూర్వవిద్యార్థులు గ్రామపెద్దలు మాట్లాడుతూ సి ద్ధగోని కృష్ణయ్య కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం అని అన్నారు ఈకార్యక్రమంలోమాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్ వెంకటే ష్ గౌడ్ చీదేడు గ్రామమాజీ సర్పంచ్ డిసిసి అధికార ప్రతినిధి బైరిక ర మాకాంత్ రెడ్డి దాద్ పల్లి గ్రామ ఉపసర్పంచ్ కావేటి నర్సింగ్ రావు కండే మల్లేష్ సిద్ధగొని శ్రీనివాస్ రాజపేట దర్శన్ అనిల్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## పాతికేళ్ల తరువాత పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



శంకర్ పల్లి వెలుతురు మే 17 :

దాదాపు పాతికేళ్ల తర్వాత తమ స్నేహితులు, చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సందడిగా గడిపారు. శంకర్పల్లి మండలం కొండకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో 20002001 సంవత్సరం (సిల్వర్‌జూబ్లీ) కార్యక్రమాన్ని ఆదివారం వారు చదివిన అదే పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ గురువులను సన్మానించి వారి ఆశీర్వాదాలను పొందారు. ఈ సందర్భంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన తమ పూర్వ విద్యార్థులను చూసి గురువులు ఆనందించారు. తమ విద్యార్థి ఎరుకలి శేఖర్ ప్రస్తుత అదే గ్రామం సర్పంచిగా సేవలందించడం పట్ల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. తమపై విద్యార్థుల ప్రేమాభినాలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. విద్యార్థినీవిద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలో గురువులతో మెలిగిన సందర్భాలను తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 17:



ఆదివారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 125 గాజుల రామారం డివిజన్ శ్రీవెన్ ఎంక్లేవ్ కు చెందిన నూతన సంక్షేమ సంఘం సభ్యులు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని, శ్రీవెన్ ఎంక్లేవ్ లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే కి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ....కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. గత పన్నండేళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ లోని అన్ని ప్రాంతాలలోని కాలనీలను అభివృద్ధి పరిచామని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన కాలనీలో మౌళిక వసతులను కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవెన్ ఎంక్లేవ్ నూతన అధ్యక్షులు బి.శ్రీధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పి.సోమరాజు, కోశాధికారి ఎన్.శ్రీనివాస్ రెడ్డి, సలహా దారులు ఎల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వాసు, గంగాధర్ రెడ్డి, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి వెంకట్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి వై. వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# గోపులారంలో శ్రీ సాయి రామ్ ఆసుపత్రి ప్రారంభం

- **రేనోవా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**
- **గ్రామస్థులకు వైద్య సేవలు**

శంకర్ పల్లి, వెలుతురు మే 17 :




గోపులారం గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో "శ్రీ సాయి రామ్ ఆసుపత్రి"ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ రేనోవా ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి వైద్య సలహాలు మరియు మందులు అందించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ తంగడిపల్లి రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ నర్సనోళ్ల జయంత్ హాజరయ్యారు. అలాగే వార్డు సభ్యులు నర్సనోళ్ల దయాకర్, సారా అక్షయ్ గౌడ్, బేగరి వినోద నర్సింలు, తొండ కల్పన గొట్టయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు టి.జి రవి కూడా పాల్గొని ఆసుపత్రి సేవలను అభినందించారు. రేనోవా ఆసుపత్రి వైద్య బృందం గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొంది. గ్రామ ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు ఉండటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. గ్రామస్థులు మాట్లాడుతూ, గోపులారం గ్రామంలో ఆసుపత్రి ప్రారంభం కావడం ఆనందకరమని, ఇకపై చిన్నచిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బృంద సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా సక్రమంగా చేయటంలో ప్రభుత్వం విఫలం

- **ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఅర్ఎస్ పార్టీ నాయకుడు లాలగారి జంగయ్య**

మంచాల వెలుతురు మే17:



మంచాల మండలం కేంద్రంలో ఇబ్రహీం పట్నం నియోజకవర్గం బిఆర్ ఎస్ పార్టీ నాయకుడు లాలగా రి జంగయ్య మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మిషన్ భగీరథ త్రాగు నీరు సరైన వి దంగా రాకపో వడంవల్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నీటి కొరత చాలా ఇబ్బందిగా ఉందని అన్నారు ప్రతి గ్రామానికి కేటాయించిన ప్రకారం త్రాగునీరు సరఫరా చేయలేక పోవడం వల్ల నియో జకవర్గంలోని ప్రజలుచాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు ఈ విషయం అధికారుల దృష్టికి తీ సుకు పోయిన ప్రయోజనం లేకుండా పోతుందని అన్నారు గతంలో బిఅర్ ఎస్ హయంలో త్రాగునీ టి కొరత లేకుండా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి గారు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చొరవ తీసుకోని అధికారులతో సమీక్షా సమావేశంపెట్టి తక్షణమే పరిష్కా రం చెశారని గుర్తు చేశారు ప్రస్తుత ఎమ్మెల్యేగారు నీటి కొరత చాలా ఇబ్బందిగా ఉన్న నిమ్మకు నిర త్త నట్టుగానే ఉన్నారని అన్నారు మిషన్ భగీరథ త్రాగునీరు అందిచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫ లం అయ్యింది అన్నారు ఇలాంటి సమస్యలు గాలికి వదిలేసి నిత్యం బిఅర్ ఎస్ పార్టీ పైన పార్టీ నా యకుల పైన విమర్శలు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు ప్రజాసమస్యలు గాలికి వ దిలేసి కాలం ఎల్లాదియ్యడం సరైంది కాదని అన్నారు ప్రభుత్వం అధికారంలోకి వస్తే100 రోజుల్లో 6 గ్యారంటీలు కచ్చితంగా అమలు చేసి తిరుతామని చెప్పిఎఒక్క గ్యారంటీ పూర్తిగా అమలు చేయ డంలో ప్రభుత్వంపూర్తిగా విఫలం చెందిందని అన్నారు ఇప్పడికైనా మీకున్న కొద్దిపాటి బి కాలంలో నైనా ప్రజాసమస్యల పై దృష్టి సారించాలని లేని ఏడలా రానున్న కాలంలో తగిన బుద్ధి చెప్పుతార ని హెచ్చరించారు

# ఉపాధ్యాయులు బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలి

- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి
- విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఘనంగా వేడుకలు
- ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా శాఖ కార్యక్రమం
- విద్యార్థుల భవిష్యత్తే ఉపాధ్యాయుల ప్రధాన లక్ష్యమని సూచన
- పదవ తరగతి తర్వాత సరైన మార్గం ఎంచుకోవాలని విద్యార్థులకు పిలుపు
- ప్రభుత్వ విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం
- సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకంపై కీలక ప్రకటన
- మెరిట్ విద్యార్థులు, క్రీడాకారులకు నగదు పురస్కారాలు అందజేత
- ఉల్లాస్ వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు
- విద్యా రంగంలో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి





రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 17:

భవిష్యత్ తరాలను చక్కటి విద్యా బుద్ధులతో తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, కలలను సాకారం చేసుకునే దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి తర్వాత ఎంచుకునే విద్యా మార్గం భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టమని పేర్కొన్నారు. అందువల్ల ఎవరు ఏమనుకుంటారో అనే సంశయాలు, మొహమాటాలకు లోనుకాకుండా తమకు ఇష్టమైన కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

ఎంచుకున్న గమ్యాన్ని చేరుకోవడానికి స్పష్టమైన ప్రణాళిక అవసరమని, ఆ దిశగా అంకితభావంతో కృషి చేస్తే తప్పకుండా విజయాన్ని సాధించగలరని ఆమె చెప్పారు. అపజయాలు ఎదురైనా నిరుత్సాహానికి లోనుకాకుండా నిరంతర శ్రమ, పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు హితవు పలికారు. బలహీనతలను అధిగమిస్తూ లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం వాటిల్లకుండా తమ బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలని కిరణ్మయి అన్నారు. గురువు స్థానానికి మరింత గౌరవం, వన్నె తీసుకురావాలంటే విద్యా బోధనలో నిబద్ధత అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ, విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.

ఈ క్రమంలోనే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ (అల్పాహారం) పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ పథకం ద్వారా విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడంతో పాటు పాఠశాల హాజరు శాతం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా విద్యా వారోత్సవాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎస్సెస్సీ టాపర్స్ ముగ్గురు, ఇంటర్మీడియట్ టాపర్స్ ఆరుగురు, క్రీడల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు తలా రూ.10,000 చొప్పున పురస్కారాలు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

ఎస్సెస్సీ టాపర్స్‌లో జెడ్పీహెచ్ఎస్ కేశంపేటకు చెందిన అమీనా, మైలార్దేవుపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం.నవ్యశ్రీ, తొర్రూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎస్.చరణ్ ఉన్నారు. ఇంటర్మీడియట్ విభాగంలో చెవెళ్లి టీజీఎంఎస్‌కు చెందిన ఈ.శ్రీతిలయ, వి.గాయత్రి, పి.పూజ, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ కందుకూరుకు చెందిన అక్షర, కేజీబీవీ కొంగూర్‌కు చెందిన జి.శరన్య, చెవెళ్లి టీజీఎంఎస్‌కు చెందిన కె.భార్గవి ప్రతిభ కనబరిచారు.

క్రీడల్లో జెడ్పీహెచ్ఎస్ చింతపట్లకు చెందిన ఎం.దివ్యశ్రీ (ఖోఖో), ఎంపీ హోమ్ సరూర్‌నగర్‌కు చెందిన ఆర్.మీనాక్షి (హాకీ), జెడ్పీహెచ్ఎస్ కర్మన్‌ఘాట్‌కు చెందిన నల్ల అశ్విత (రగ్బీ) పురస్కారాలు అందుకున్నారు.

అలాగే ఉల్లాస్ కార్యక్రమంలో ఉత్తమ వాలంటీర్లుగా సేవలందించిన వారికి కూడా నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వారు గ్రామ స్థాయి విద్యా కార్యక్రమాల్లో చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, SSA సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం కార్యక్రమం విద్యా రంగ అభివృద్ధి, విద్యార్థుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల పాత్రపై దృష్టి సారిస్తూ విజయవంతంగా ముగిసింది.

## సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్..300 మందిపై కేసులు

సైబరాబాద్ వెలుతురు మే 17:

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP ట్రాఫిక్ I, జి హన్మంతరావుతెలిపారు.

ఈ డ్రైవ్‌లో భాగంగా 300 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.253 ద్విచక్ర వాహనదారులు,09 ఆటోలు,38 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.

బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —232 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 35 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,33 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.

వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.



మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.

గత వారం (11.05.2026-16.05.2026) లో మొత్తం 96 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో 07 మందికి జరిమానా, జైలు శిక్ష,02 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,87 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

## చల్లమల్ల కృష్ణారెడ్డి కుమారుడి నిశ్చితార్థ వేడుకకు హాజరైన సురిగి నరసింహ గౌడ్



హైదరాబాద్ వెలుతురు మే 17:

ఆదివారం రోజున హైదరాబాద్‌లోని మంత్ర కన్వెన్షన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీ చెల్లమల్ల కృష్ణారెడ్డి గారి కనిష్ట పుత్రుడు శ్రీ చెల్లమల్ల వినీత్ రెడ్డి గారు మరియు లిపి రెడ్డి గారి నిశ్చితార్థ వేడుకకు మునుగోడు మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ సురిగి నరసింహ గౌడ్ గారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కందుల రవికుమార్ గౌడ్, మునుకుంట్ల బలరాం గౌడ్, మునుకుంట్ల శ్రీనివాస్ గౌడ్, మునుకుంట్ల కుమార్ గౌడ్, బోయపల్లి సూర్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో యువజన–క్రీడల వారోత్సవాలు

## 18 నుంచి 23 వరకు విస్తృత కార్యక్రమాలు

- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వారోత్సవాల నిర్వహణ
- యువతలో ఆరోగ్యం, నైపుణ్యం, నాయకత్వంపై ప్రత్యేక దృష్టి
- 18న సరూర్‌నగర్ నుంచి 5 కిలోమీటర్ల మారథాన్ ప్రారంభం
- 19న కెరీర్ గైడెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం
- 20న యువ నాయకత్వ సదస్సు, యువజన పార్లమెంట్ నిర్వహణ
- 21న క్రీడా పోటీలు, యువ క్రీడాకారులకు వేదిక
- 22న స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమాలు మండల స్థాయిలో నిర్వహణ
- 23న ఉద్యోగ సాధన కార్యక్రమం, జాబ్ మేళా అపాయింట్‌మెంట్లు పంపిణీ
- సీఎం కప్ విజేతలకు సన్మానం, క్రీడా పురస్కారాల ప్రదానం
- జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఏర్పాట్లు

రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 17:

రంగారెడ్డి జిల్లాలో యువతలో శారీరక దృఢత్వం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో “యువజన క్రీడల వారోత్సవాలు” నిర్వహించనున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాలు ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించబడనున్నాయి. ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యం యువతలో ఆరోగ్య చైతన్యం, నాయకత్వ లక్షణాలు, క్రీడాస్ఫూర్తి, నైపుణ్యాభివృద్ధి మరియు సామాజిక బాధ్యతలను పెంపొందించడం అని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.



**18న ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ మారథాన్**

వారోత్సవాల ప్రారంభంగా 18వ తేదీ ఉదయం 6 గంటలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుంచి కొత్తపేట్ సిగ్నల్ క్రాస్ రోడ్ వరకు 5 కిలోమీటర్ల మారథాన్ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, కోచ్‌లు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. మండల స్థాయిలో MPDOలు, MEOల ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.

**19న కెరీర్, స్కిల్ డెవలప్‌మెంట్**

19వ తేదీ ఉదయం 11 గంటలకు కొంగరకలాన్ జిల్లా కలెక్టరేట్ లో కెరీర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించబడుతుంది. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి పథకాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నారు.

**20న యువ నాయకత్వ సదస్సు**

20వ తేదీ యువ నాయకత్వ సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో యువతకు నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, సమాజ నిర్మాణంలో యువత పాత్రపై మార్గదర్శనం ఇవ్వనున్నారు. యువజన పార్లమెంట్ కూడా నిర్వహించబడుతుంది.

**21న క్రీడా దినోత్సవం**

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించబడతాయి. వివిధ క్రీడల్లో యువత తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. క్రమశిక్షణ, జట్టు భావన, ఆరోగ్యకర జీవనంపై అవగాహన కల్పించనున్నారు.

**22న స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమాలు**

మండల స్థాయిలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

**23న ఉద్యోగ సాధన కార్యక్రమం**

23వ తేదీ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉద్యోగ సాధన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన యువతకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేయనున్నారు. సీఎం కప్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించనున్నారు. ఈ కార్యక్రమాలు యువతకు ఉపాధి అవకాశాలు, క్రీడా ప్రోత్సాహం, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించేలా రూపొందించబడ్డాయని జిల్లా అధికారులు తెలిపారు. పెద్ద సంఖ్యలో యువత, ప్రజలు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ పిలుపునిచ్చింది.

# భవిష్యత్తుకు బలమైన పునాది విద్య





- **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**నల్లగొండ వెలుతురు మే 17:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నల్గొండ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా విజయోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. మొదటి స్థానంలో నిలిచిన 13 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. కేజీబి వి మరియు మోడల్ స్కూల్‌లకు చెందిన 5 మంది విద్యార్థులు, స్పోర్ట్స్ స్కూల్ నుండి 4 మంది, జూనియర్ కళాశాలల నుంచి 3 విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఇష్టంతో, కష్టపడి చదవాలని చెప్పారు. పదవ తరగతితో చదువును ఆపకుండా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలని, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదివితేనే నేటి పోటీ ప్రపంచంలో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గ్రాడ్యుయేషన్ విద్యతో జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. పై చదువులకు వెళ్లే విద్యార్థులకు సరైన దిశానిర్దేశం అవసరమని, ఉపాధ్యాయులు, ఎంఈఓలు విద్యార్థులను ప్రోత్సహించే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం మానసిక దివ్యాంగులకు అవసరమైన కిట్‌లను జిల్లా కలెక్టర్ అందజేసి వారి పట్ల సామాజిక బాధ్యతను తెలియజేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి దస్రునాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి , ఎంఈఓ లు , ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



- **అలనాటి మధుర స్మృతులు... నెమరు వేసుకున్న రఘునాథపురం పాఠశాల పూర్వ విద్యార్థులు**

**యాదగిరిగుట్ట, మే 17 వెలుతురు న్యూస్:** రఘునాథపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాల 2001. 2002 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామ శివారులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాల 2001 2002 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు అంతా వివిధ ప్రాంతాల నుండి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. అలనాటి జ్ఞాపకాలు, మధుర స్మృతులు నెమరు వేసుకుంటూ ఘనంగా పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన టీచర్లను వారంతా ఘనంగా సభా ప్రాంగణానికి ఆహ్వానిస్తూ పూలవర్షం కురిపించారు. అనంతరం వేదిక పైన అలనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను పూలమాలలు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ నాటి జ్ఞాపకాలు, మధుర స్మృతులు విద్యార్థులతో పంచుకున్నారు. దీంతో పాటుగా పలువురు విద్యార్థులు ఆనాడు తమకు ఎదురైన అనుభవాలను, జ్ఞాపకాలను తోటి విద్యార్థులతో పంచుకొని ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు పాటలు నృత్యాలు సరదా సరదా ఆటలతో సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. విద్యార్థులు అంతా కలిసి ఉపాధ్యాయులతో పాటు ఫోటోలు దిగి 24 సంవత్సరాల తర్వాత తమ జ్ఞాపకాలను మరోసారి పదిలపరుచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకింత భావోద్వేగానికి లోనై ఆనంద భాష్పాలతో చివరికి ఒకరికొకరు వీడ్కోలు పలుకుతూ తమ తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు బైర రాజశేఖర్, బల్ల రాజు, బేతి శ్రవణ్ కుమార్, బేతి రవికుమార్, పల్లె శ్రీనివాస్, జి చంద్రశేఖర్, వై యాదగిరి, సిహెచ్ రాజేశ్వర్ , ఎ బలరాం , వై ఆనంద్, అన్నపూర్ణ , బి చంద్రకళ, ప్రసన్న, బాలజ్యోతి, ఉమారాణి, ధనుంజయ శ్రీకాంత్, వెంకటేష్, సురేందర్ , శేఖర్, లక్ష్మీ ప్రసాద్ ఎండి గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎద్దును దొంగిలించిన దుండగులు



**మోత్కూర్ మే 17 (వెలుతురు న్యూస్):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సాయిరాం డిగ్రీ కాలేజీ పరిసర ప్రాంతంలో ఎద్దు దొంగతనం జరిగింది . బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం, మోత్కూరుకు చెందిన రైతు తొట్ల అంజయ్యకు చెందిన సుమారు రూ.80 వేల విలువ చేసే కోడెను గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి దొంగిలించారు. రాత్రి 1 గంట సమయంలో కూడా ఉందని ఉదయం 4 సమయంలో చూస్తే ఎద్దు కనిపించలేదని తెలిపారు. ముందస్తుగా రెక్కీ నిర్వహించి వాహనంలో ఎద్దును తీసుకెళ్లి ఉండవచ్చని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. ఉదయం లేచి చూసేసరికి ఎద్దు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యి పరిసర ప్రాంతాలలో వెతికి ఆచూకీ లభించకపోవడంతో వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ, అనుమానాస్పద వాహనాలపై ఆరా తీస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## బ్రాహ్మణ వెల్లంల మాజీ సర్పంచ్ చెరుకుపల్లి పరమేశం మరణం గ్రామానికి తీరని లోటు



- **చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**
- **గంజి మురళీధర్ నివాళి**

**నార్కట్ పల్లి వెలుతురు మే 17:** నార్కెట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామ మాజీ సర్పంచ్ చెరుకుపల్లి పరమేశం మృతి గ్రామానికి తీరని లోటని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ అన్నారు. ఆదివారం ఆయన బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చేరుకుని పరమేశం పార్థివ దేహంపై పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ, సాధారణ పద్మశాలి కుటుంబంలో జన్మించిన చెరుకుపల్లి పరమేశం గ్రామ సర్పంచ్‌గా, పద్మశాలి సంఘ నాయకుడిగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. గ్రామంలో మంచినీటి సౌకర్యం కోసం బోరు పంపులు ఏర్పాటు చేయడం, మట్టి రోడ్లు నిర్మించడం, విద్యుత్ సౌకర్యం కల్పించడం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. అదేవిధంగా చేనేత సంఘ అధ్యక్షుడిగా కూడా సేవలందిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన చేసిన సేవలను అందరూ కలిసి ముందుకు తీసుకెళితేనే నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. అనారోగ్య సమస్యతో శనివారం సాయంత్రం 7 గంటలకు పరమేశం మరణించారని తెలిసి గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత అధ్యక్షులు కందగట్ల గణేష్, జిల్లా నాయకులు నామని ప్రభాకర్, కర్నాటి బిక్షం, పరమేశం కుమారుడు జిల్లా నాయకులు చెరుకుపల్లి రఘుపతి, చెరుకుపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీ కుటుంబాల పిల్లల్లో ప్రతిభకు 'స్పార్క్' వెలుగు









- **విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యం...**
- **ఉత్తమ ఫలితాలు సాధించిన పోలీసు కుటుంబాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, రివార్డులు...**
- **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఐపీఎస్.**

**జహీరాబాద్ వెలుతురు మే 17:** సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు కుటుంబాలకు చెందిన విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి విద్యా ప్రగతికి తోడ్పడాలనే లక్ష్యంతో ఆదివారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో "స్పార్క్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. ముందుగా పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంగారెడ్డి జిల్లా విద్యార్థులందరికీ జిల్లా పోలీసు శాఖ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పోలీసు కుటుంబాలకు చెందిన పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి విద్యా ప్రగతికి తోడ్పడాలనే ఉద్దేశ్యంతో "స్పార్క్ – సపోర్టింగ్ పొటెన్షియల్ అకడమిక్ రైజ్ ఫర్ ఖాకీ కిడ్స్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. "స్పార్క్" అనేది చిన్న నిప్పురవ్వ లాంటిదని, దానిని సక్రమంగా ఉపయోగిస్తే వెలుగుని, ఉపయోగాన్ని ఇస్తుందని అన్నారు. అదే నిర్లక్ష్యం చేస్తే అది పెద్ద అగ్నిలా మారి నియంత్రణకు అందకుండా పోవచ్చని హెచ్చరించారు. చిన్న వయస్సులోనే పిల్లల్లో ఉన్న ప్రతిభను సరైన దిశలో ప్రోత్సహిస్తే వారు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన దశలని పేర్కొన్న ఎస్పీ.. ఈ సమయంలో విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా సెల్‌ఫోన్ వినియోగంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలను మరీ కఠినంగా గానీ, అతిగా గారాబంగా గానీ పెంచకుండా సమతుల్యంగా పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. 90 శాతానికి పైగా మార్కులు సాధించడం సాధారణ విషయం కాదని, అది విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. పోలీసు కుటుంబాల పిల్లల్లో విద్యాపట్ల మరింత ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే "స్పార్క్" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. విద్యార్థులు చదువులోనే కాకుండా క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాల్లో కూడా ముందుండాలని సూచించారు. కష్టపడే తత్వాన్ని నమ్మినవారు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, ప్రతి విద్యార్థి పెద్ద కలలు కనాలని, వాటిని నిజం చేసుకునేందుకు పట్టుదలతో ముందుకు సాగాలని అన్నారు. విజయం ఒక్క రోజులో రాదని, నిరంతర కృషి, సమయ పాలన, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగులైన తల్లిదండ్రులు పండుగలు, ఇతర ఉత్సవాల సమయంలో కూడా ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తారని, అందువల్లే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని విద్యార్థులు గుర్తుంచుకోవాలని సూచించారు. తమ తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిటిసి అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పద్మావతి, డీఎస్పీలు సత్యయ్య గౌడ్, వెంకట్ రెడ్డి, ప్రభాకర్, సైదా నాయక్, ఆర్‌డీఎస్పీ నరేందర్, జిల్లా ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు సురేష్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో జబర్దస్త్ ఫేమ్ వర్షిణి సందడి





- **ఇంటచ్ మొబైల్స్‌లో వివో X300 FE ఘన ప్రారంభం...**
- **అభిమానులతో సెల్ఫీలు.. యువతతో కళకళలాడిన షోరూమ్....**

**జహీరాబాద్ వెలుతురు, మే 15:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం సినీ, టెలివిజన్ అభిమానులతో కళకళలాడింది. ప్రముఖ కామెడీ షో 'జబర్దస్త్' ద్వారా గుర్తింపు పొందిన సినీ నటి వర్షిణి పట్టణంలో సందడి చేశారు. పట్టణంలోని ప్రముఖ మొబైల్ షోరూమ్ ఇంటచ్ మొబైల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, ప్రముఖ మొబైల్ బ్రాండ్ వివో విడుదల చేసిన అత్యాధునిక స్మార్ట్‌ఫోన్ వివో X300 FE మొబైల్ సేల్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ వద్ద అభిమానులు, యువత భారీ సంఖ్యలో తరలివచ్చారు. వర్షిణిని ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపడంతో షోరూమ్ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. అభిమానులకు అభివాదం చేసిన వర్షిణి, పలువురితో సెల్ఫీలు దిగుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె రాకతో యువత ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొంది. కార్యక్రమంలో భాగంగా వివో X300 FE మొబైల్‌ను కొనుగోలు చేసిన తొలి వినియోగదారులకు వర్షిణి స్వయంగా మొబైల్ ఫోన్లను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మొబైల్ ఫీచర్లపై మాట్లాడిన ఆమె, ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను తప్పకుండా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతను దృష్టిలో ఉంచుకొని అద్భుతమైన కెమెరా క్వాలిటీ, ఫాస్ట్ ప్రాసెసింగ్, స్టైలిష్ డిజైన్, అధిక బ్యాటరీ సామర్థ్యంతో ఈ ఫోన్ మార్కెట్‌లోకి వచ్చిందని తెలిపారు. ఇంటచ్ మొబైల్స్ యాజమాన్యం మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన మొబైల్ ఉత్పత్తులను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. వివో X300 FE విడుదలకు జహీరాబాద్ ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. ప్రముఖ నటి వర్షిణి పాల్గొనడంతో కార్యక్రమానికి మరింత ఆకర్షణ ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటచ్ మొబైల్స్ యాజమాన్యం రాహుల్ బెజుగం, వివో తెలంగాణ హెడ్ వేణు కట్ల, డిస్ట్రిబ్యూటర్ హెడ్ శ్రీకాంత్, వివో టీఎల్ అజరుద్దీన్, ఏఎస్ఎం ఇస్మాయిల్, పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవే జీవితానికి సార్థకత.. పులిలోంక చర్చికి ఫ్రిజర్ బహూకరించిన సర్పంచ్ దేశెట్టి

- **రూ.75 వేల విలువైన ఫ్రిజర్ అందజేత...**
- **సేవా కార్యక్రమాలు చిరస్థాయిగా నిలుస్తాయన్న గుంజెటి సర్పంచ్...**




**జహీరాబాద్ వెలుతురు, మే 17:** సమాజంలో అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచి సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే జీవితానికి నిజమైన సార్థకత లభిస్తుందని గుంజెటి గ్రామ సర్పంచ్ బొమ్మ దేశెట్టి పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలంలోని హద్నూర్ – న్యామతాబాద్ గ్రామాల మధ్యగల పులిలోంక చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చర్చి పాస్టర్ ప్రవీణ్ కుమార్ ఆహ్వానం మేరకు సర్పంచ్ దేశెట్టి పాటిల్ తన సొంత ఖర్చులతో రూ.75 వేల విలువైన ఫ్రిజర్‌ను చర్చి నిర్వాహకులకు బహూకరించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రవీణ్ కుమార్ మరియు చర్చి బృందం సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, వారి దీర్ఘాయుష్షు, ఐశ్వర్యాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేశెట్టి పాటిల్ మాట్లాడుతూ.. మనిషి జీవితంలో కేవలం తన కోసమే కాకుండా సమాజం కోసం కూడా ఆలోచించాలని అన్నారు. సంపాదించే ధనంలో కొంత భాగాన్ని పేదల కోసం, సేవా కార్యక్రమాల కోసం వినియోగించినప్పుడే నిజమైన సంతృప్తి లభిస్తుందని తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ ఎన్నో సందర్భాల్లో సేవా భావం, మానవత్వం గురించి చెప్పేవారని, ఆ మాటలు తనను సేవా కార్యక్రమాల వైపు మరింత ప్రేరేపించాయని పేర్కొన్నారు. కేవలం స్వార్థపూరితంగా జీవిస్తే జీవితంలో ఎలాంటి సంతృప్తి ఉండదని, కష్టకాలంలో నలుగురికి అండగా నిలిచి వారి బాధలను పంచుకున్నప్పుడే నిజమైన ఆనందం లభిస్తుందని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని, సమాజానికి ఉపయోగపడే ప్రతి మంచి కార్యక్రమంలో ముందుండేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంజెటి గ్రామ ఉపసర్పంచ్ జీవన్, శివప్ప, పట్లోళ్ల ప్రభాకర్, పట్లూర్ సంగమేశ్వర్, బొడేగం శివన్న, రాంతీర్థ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి తొలి ప్రాధాన్యత





- **వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం...**
- **3వ వార్డు కౌన్సిలర్ గంకటి శ్రీధర్ రెడ్డి...**

**జహీరాబాద్ వెలుతురు, మే 17:** ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రధాన లక్ష్యమని, వార్డులో నెలకొని ఉన్న సమస్యలను సమూలంగా పరిష్కరిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తామని జహీరాబాద్ మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ గంకటి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను తొలగించేందుకు తొలి ప్రాధాన్యతతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పస్తాపూర్‌కు చెందిన 3వ వార్డులో చాలా కాలంగా నెలకొన్న తాగునీటి సమస్య కారణంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు చేసిన విజ్ఞప్తిని స్వీకరించిన కౌన్సిలర్ గంకటి శ్రీధర్ రెడ్డి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు ప్రారంభించారు. ఆదివారం మధ్యాహ్నం సంబంధిత ప్రాంతంలో బోర్‌వెల్ తవ్వకానికి భూమిపూజ నిర్వహించి, టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరించి వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేయడమే తమ ధ్యేయమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. తన తండ్రి స్వర్గీయ ప్రతాప్ రెడ్డి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజా సేవలో ముందుకు సాగుతున్నానని, ప్రజల సమస్యల పరిష్కారమే తనకు ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకొని వాటికి తక్షణమే స్పందించే విధంగా పని చేస్తున్నామని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్‌వెల్ తవ్వకానికి శ్రీకారం చుట్టిన కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డికి కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించి చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొంటూ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వార్డు అభివృద్ధి పట్ల కౌన్సిలర్ చూపుతున్న చొరవతో భవిష్యత్తులో మరిన్ని సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.

# పిడుగుపాటుకు 30 గొర్రెల మృతి... గొర్రెల కాపరికి త్రుటిలో తప్పిన ప్రమాదం





- గొర్రెల కాపరిని పరామర్శించిన మంత్రి జూపల్లి
- రూ.50 వేల తక్షణ సాయం అందించిన మంత్రి
- మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం పరిశీలన.. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు
- ఎన్ని ఇబ్బందులు రైతులు పండించిన చివరి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది: మంత్రి జూపల్లి

**కొల్లాపూర్, వెలుతురు మే 17:**
కొల్లాపూర్ మండలం ఎనబెట్ల గ్రామ శివారులో శనివారం పిడుగుపాటుకు 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంలో గొర్రెల కాపరి త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. విషయం తెలుసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే స్పందించి, బాధిత గొర్రెల కాపరిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఆయనను ఓదార్చారు. ప్రభుత్వం తరపున పూర్తి అండగా ఉంటామని హామీ ఇస్తూ, తక్షణ సహాయం కింద రూ.50 వేల నగదును అందజేశారు.

**తడిసిన ధాన్యం పరిశీలన..**

అనంతరం మంత్రి జూపల్లి కొల్లాపూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్న రాశులను ఆయన నిశితంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిసినప్పటికీ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, జిల్లా అధికారుల పర్యవేక్షణలో తడిసిన ధాన్యాన్ని సైతం గోదాములకు తరలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**సీఎం నిరంతరం పర్యవేక్షణ..**

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కొనుగోళ్ల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో మొక్కజొన్న దిగుబడి ఊహించిన దానికంటే భారీగా పెరగడంతో గోదాములు సరిపోవడం లేదని చెప్పారు. ఈ సమస్యను అధిగమించడానికి కాటన్ గోదాములు, ప్రైవేట్ గోదాములతో పాటు అవసరమైన చోట ఫంక్షన్ హాళ్లను సైతం వినియోగించుకుని నిల్వ చేస్తున్నామని వివరించారు. ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటోందన్నారు.

**ఇబ్బందులున్నా అధిక ధరకే కొనుగోలు..**

కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొనుగోలు చేయడం లేదని మంత్రి జూపల్లి విమర్శించారు. దీనివల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి వస్తోందన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నకు చాలా తక్కువ ధర ఉన్నప్పటికీ, రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. హమాలీల కొరత, ఆర్థిక ఇబ్బందులు, గోదాముల కొరత వంటి సమస్యలు వేధిస్తున్నప్పటికీ.. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పాస్‌పోర్ట్ సరెండర్ చేసిన విడదల రజని



- హైకోర్టు ఆదేశాలతో డీఎస్పీ కార్యాలయంలో అప్పగింత
- పల్నాడు జిల్లా నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో పాస్‌పోర్ట్ అప్పగింత
- హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టిన మాజీ మంత్రి విడదల రజని
- చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు
- తెదేపా నేత పిల్లి కోటి ఫిర్యాదుతో కేసు దాఖలు అయిన విషయం
- విడదల రజనీతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసిన పోలీసులు
- హైకోర్టు పాస్‌పోర్ట్ డిపాజిట్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ
- నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావుకు పాస్‌పోర్ట్ అప్పగింత
- న్యాయస్థానం ఆదేశాల ప్రకారం నిబంధనలు అమలు చేసిన అధికారులు
- కేసు విచారణలో భాగంగా ముందస్తు షరతులు అమలు
- దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో కీలక పరిణామంగా పాస్‌పోర్ట్ సరెండర్

**అమరావతి వెలుతురు మే 17:**
హైకోర్టు ఆదేశాల మేరకు మాజీ మంత్రి, వైకాపా నేత విడదల రజని తన పాస్‌పోర్ట్‌ను పల్నాడు జిల్లా నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో సరెండర్ చేశారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ హనుమంతరావుకు ఆమె పాస్‌పోర్ట్‌ను అధికారికంగా అప్పగించారు. చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌లో తెదేపా నేత పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విడదల రజనీతో పాటు మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ కేసు నేపథ్యంలో న్యాయస్థానం పలు షరతులు విధిస్తూ పాస్‌పోర్ట్‌ను సంబంధిత పోలీస్ అధికారికి డిపాజిట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలను అనుసరించి నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో ఆమె పాస్‌పోర్ట్‌ను సమర్పించినట్లు పోలీసులు తెలిపారు. కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన చర్యలు నిబంధనల ప్రకారం కొనసాగనున్నాయి.



# ఈ-బస్సుల ప్రవేశంతో ప్రైవేటీకరణ జరగదు

- ఏపీఎస్ఆర్టీసీ స్పష్టీకరణ
- ఉద్యోగులకు ఎలాంటి నష్టం ఉండదని అధికారిక వివరణ
- ప్రధాని ఈ-బస్ సేవా పథకం కింద 1,050 బస్సులు కేటాయింపు
- రాష్ట్రంలోని 11 నగరాలకు 750 ఎలక్ట్రిక్ బస్సులు
- తిరుమల-తిరుపతి ఘాట్ మార్గానికి 300 ప్రత్యేక బస్సులు
- బస్సుల టెండర్ల ప్రక్రియ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహణ
- పినాకిల్ ఇండియా లిమిటెడ్ బస్సుల సరఫరాదారుగా ఎంపిక




- పర్యావరణహిత ప్రజారవాణాపై సంస్థ దృష్టి
- ఆధునిక రవాణా వ్యవస్థకు ఇది కీలక ముందడుగు
- ప్రజలకు సురక్షిత, సమర్థవంతమైన సేవలే లక్ష్యమని స్పష్టీకరణ

**అమరావతి వెలుతురు మే 17:** సంస్థలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంపై వస్తున్న ఊహాగానాలకు ఏపీఎస్ఆర్టీసీ స్పష్టమైన వివరణ ఇచ్చింది. ఈబస్సుల వల్ల సంస్థ ప్రైవేటీకరణ జరుగుతుందన్న వార్తల్లో నిజం లేదని, అలాగే ఉద్యోగులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని అధికారికంగా వెల్లడించింది. ప్రధాని ఈబస్ సేవా పథకం కింద రాష్ట్రానికి మొత్తం 1,050 ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర ప్రభుత్వం కేటాయించినట్లు ఏపీఎస్ఆర్టీసీ తెలిపింది. ఇందులో 11 నగరాల్లో నడపడానికి 750 బస్సులు, అలాగే తిరుమల-తిరుపతి ఘాట్ మార్గంలో సేవల కోసం 300 బస్సులు ఉండనున్నాయని వివరించింది. ఈ బస్సుల సరఫరా కోసం టెండర్ల ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం నిర్వహించిందని సంస్థ స్పష్టం చేసింది. ఆ ప్రక్రియలో భాగంగా పినాకిల్ ఇండియా లిమిటెడ్ సంస్థ బస్సుల సరఫరాదారుగా ఎంపికైనట్లు తెలిపింది. రాష్ట్రంలో ఈ బస్సుల ద్వారా ప్రజారవాణా సేవలను మరింత ఆధునికంగా, పర్యావరణహితంగా మార్చడమే లక్ష్యమని పేర్కొంది. ఏపీఎస్ఆర్టీసీ ప్రకారం, ఈ ప్రాజెక్ట్ ద్వారా ఇంధన వినియోగం తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణలో కూడా కీలక పాత్ర పోషించనుంది. సురక్షితమైన, సమర్థవంతమైన ప్రజారవాణా సేవలను అందించడమే సంస్థ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ విద్యార్థిని దుర్మరణం

- నల్గొండ జిల్లా చెరువుగట్టు గ్రామానికి చెందిన యువతి
- రెండున్నరేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా ప్రయాణం
- పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్న విద్యార్థిని
- కారులో స్నేహితులతో వెళ్తుండగా వెనుక నుంచి ఢీకొట్టిన వాహనం
- ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన నవ్య
- కుటుంబ సభ్యులకు తీవ్ర విషాదం.. గ్రామంలో శోకఛాయలు
- మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు చర్యలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంతాపం



**హైదరాబాద్ వెలుతురు మే 17:** అమెరికాలో మరో భారతీయ విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన చోటుచేసుకుంది. నల్గొండ జిల్లా చెరువుగట్టు గ్రామానికి చెందిన గడసు శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె నవ్య (24) షికాగోలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఉన్నత విద్య కోసం రెండున్నరేళ్ల క్రితం అమెరికా వెళ్లిన నవ్య ప్రస్తుతం అక్కడ చదువుతో పాటు పార్ట్‌టైమ్ ఉద్యోగం కూడా చేస్తూ జీవనం కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం ఆమె తన ముగ్గురు స్నేహితులతో కలిసి కారులో ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన నవ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక సమాచారం వెల్లడించింది. ఈ ఘటనతో సహచరులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. నల్గొండ జిల్లా చెరువుగట్టు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమార్తె మృతిపై సమాచారం అందుకున్న వెంటనే తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బాధిత కుటుంబానికి సంతాపం తెలిపారు. అధికారులతో మాట్లాడిన మంత్రి, నవ్య భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. విదేశాంగ శాఖ ద్వారా సహాయ చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. మరో యువ భారతీయ విద్యార్థిని అకాల మరణం దేశవ్యాప్తంగా ఆవేదన కలిగిస్తోంది.

## జూన్ 2 నుంచి కొత్త పెన్షన్లు అమలు చేస్తాం



- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- బీఆర్ఎస్ హయాంలో పెన్షన్లపై విఫలమైందని మంత్రి విమర్శ
- జూన్ 2 నుంచి కొత్త పెన్షన్ విధానం అమలు చేస్తామని ప్రకటన
- మిర్యాలగూడలో పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి
- కోడి రెక్క శౌరి అంత్యక్రియల్లో పాల్గొని నివాళులు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో కలిసి మీడియా సమావేశం
- ధాన్యం కొనుగోలులో పారదర్శకత పాటిస్తున్నామని స్పష్టీకరణ
- ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల అభ్యున్నతికి చర్యలు
- మిర్యాలగూడ, నకిరేకల్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు
- ఫార్మా రంగ భద్రతపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు వెల్లడి
- కార్మికుల రక్షణకు ఫ్యాక్టరీలపై నిరంతర పర్యవేక్షణ

**మిర్యాలగూడ వెలుతురు మే 17:** ఈ ఏడాది జూన్ 2వ తేదీ నుంచి కొత్త పెన్షన్ విధానాన్ని తమ ప్రభుత్వం అమలు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పెన్షన్ల విషయంలో సరైన చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఆదివారం మిర్యాలగూడలో పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోడి రెక్క శౌరి అంత్యక్రియల్లో పాల్గొని ఆయనకు నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వం పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తోందని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల గృహ అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మిర్యాలగూడ, నకిరేకల్ ప్రాంతాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. దీనికి సంబంధించిన పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. ఫార్మా రంగంలో కార్మికుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు కొత్త విధివిధానాలు రూపొందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

## చలమల కృష్ణారెడ్డి కుమారుడి నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు మే 17:** హైదరాబాద్ పెద్ద గోల్కొండ లోని మంత్ర కన్వెన్షన్ హాల్లో జరిగిన మునుగోడు నియోజకవర్గ నాయకులు చలమల కృష్ణారెడ్డి కుమారుడి నిశ్చితార్థ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కాబోయే వధూవరులను ఆశీర్వదించిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి.

## కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్యకు శుభాకాంక్షలు



- నూతన చైర్మన్‌గా సరిత తిరుపతయ్యకు నియామకం
- ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం నియామక ఉత్తర్వులు
- జోగులాంబ గద్వాల్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్‌గా సేవలు
- స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్
- శాలువాతో ఘనంగా సత్కారం

**రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 17:** రంగారెడ్డి జిల్లాలో మర్యాదపూర్వక భేటీ జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నియమించిన తెలంగాణ రాష్ట్ర షిప్ అండ్ గోట్ కార్పొరేషన్ చైర్మన్‌గా జోగులాంబ గద్వాల్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీమతి సరిత తిరుపతయ్య గారిని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీజ్యోతి భీమ్ భరత్ చైర్మన్ సరిత తిరుపతయ్యను శాలువాతో ఘనంగా సత్కరించి, నూతన బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైనందుకు అభినందనలు తెలియజేశారు. ఈ మర్యాదపూర్వక భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. సమాజ సేవలో మరింతగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆకాంక్ష వ్యక్తమైంది.

# పులుపులో దాగిన తియ్యదనం

బద్దలంటే ముక్కలు. మాగాయిముక్కని 'మాగాయిబద్ద' అంటారు. 'చీబద్ద' అనే పదం వర్ణవ్యత్యయం జరిగి 'చీదబ్బ' అయ్యింది. పెద్ద తొనలు విడదీయగలిగే స్వభావం వలనే ఈ పండు దబ్బ పండు అయ్యింది.

బద్దలంటే ముక్కలు. మాగాయిముక్కని 'మాగాయిబద్ద' అంటారు. 'చీబద్ద' అనే పదం వర్ణవ్యత్యయం జరిగి 'చీదబ్బ' అయ్యింది. పెద్ద తొనలు విడదీయగలిగే స్వభావం వలనే ఈ పండు దబ్బ పండు అయ్యింది. ముక్కలు (తొనలు) కలిగిన పండు దబ్బపండు. కమలా, బత్తాయి లాంటి పళ్లు మనకి రెండుమూడు శతాబ్దాల కాలంలో పరిచయం అయినవే! తొనలు కలిగిన నారింజ, దబ్బ ఆదిమ కాలం నుంచి మన సంస్కృతిలో భాగంగా ఉన్నాయి.

దబ్బలో దూదిదబ్బ, నారదబ్బ అని రెండు రకాలున్నాయి. మందపాటి తోలు ఉండి దాని అడుగున దూది పొరలుండేది దూది దబ్బ. నార లేదా పీచు ఎక్కువగా ఆవరించి ఉన్నది నారదబ్బ. దానికే నారదం, నారంగరంగం, నారంగం, నారింజ అనే పేరు ఏర్పడింది. నారింజ అనే తెలుగు పేరులో 'నా' లోపించి ఇంగ్లీషువాడి నోట ఆరెంజయ్యింది.

దబ్బపండు తోలు, గింజలు, తొనలు ఆహారానికే కాదు, వైద్యానికి కూడా పనికొస్తాయి. పేగుల్లో వచ్చే వ్యాధుల్లో దీని ప్రయోగం ఎక్కువ. మొలల వ్యాధిలో ఇది ప్రముఖమైన ఔషధం కూడా. పుల్లనిదైనప్పటికీ వేడినీ, వాతాన్నీ, కఫాన్ని, వాంతి, వికారాలను తగ్గిస్తుంది. దబ్బ రసం ఇస్తే మద్యం మైకం దిగిపోతుంది. వెక్కిళ్లు ఆగుతాయి. దగ్గు, ఆయాసం తగ్గుతాయి. దబ్బపండ్లు ఎముక పుష్టినిస్తాయి. కండరాలు బలసంపన్నం అవుతాయి. కిడ్నీ, లివర్లను శక్తిమంతం చేస్తాయి. గుండెకు టానిక్‌లాగా పని చేస్తాయి. కండరాలు శుష్కించిపోయే వ్యాధిలో మేలు చేస్తాయి. బాగా పండిన దబ్బలో సివిటమిన్ అధికంగా ఉంటుంది. పొయ్యెక్కించకుండా దబ్బరసంతో వంటకాలు చేసుకోవాలి. వేడి తగిలితే చేదు వస్తుంది.



## దబ్బపానీయం:

దబ్బ తొనల్ని వలిచి, కొద్దిగా సైంధవ లవణం, అల్లం రసం కలిపి, కొద్దిసేపు ఉంచితే తొనల లోపల ముత్యాల నుంచి రసం బయటకొస్తుంది. ఇది కఫాన్ని, వాతాన్ని తగ్గించి గుండెకు మేలు చేస్తుంది. లివర్‌కు మంచిది. కడుపునొప్పిని తగ్గిస్తుంది. విరేచనం అయ్యేలా చేస్తుంది. ఉదయంపూట తాగితే మంచిది. వేసవిలో వడకొట్టకుండా ఉపయోగపడే పానీయం. మెనోపాజ్ వచ్చిన స్త్రీలు ప్రతీ రోజు దబ్బపానీయం తాగుతుంటే మంచిది!

## దబ్బ పప్పు:

కందిపప్పు లేదా పెసరపప్పుని ఉడికించి, చల్లారాక అందులో దబ్బరసం, ఉప్పు, కారం కలిపి, తాలింపు పెట్టిన దబ్బ పప్పు ఆరోగ్యానికి మంచిది.

## దబ్బ పులిహోర:

చింతపండు రసానికి బదులుగా దబ్బరసం కలిపి, తాలింపు పెట్టిన పులిహోర రుచికరంగా ఉంటుంది. ఆవపిండి, మెంతిపిండి కూడా కొద్దిగా కలిపితే మేలుచేస్తుంది.

## దబ్బకారం:

ఓ బాండీలో కొంచెం నూనె లేదా నెయ్యి వేసి, అందులో తగినన్ని మిరియాలు లేదా మిరపకాయలు, తాలింపు గింజల్ని వేగించి మెత్తగా నూరి, దాంట్లో ఉప్పు, దబ్బ రసం కలపాలి! ఈ దబ్బ కారం లేదా దబ్బ పచ్చడి కమ్మగా ఉంటుంది. తొనలో ఉండే ముత్యాలను నలిపేయకుండా అలానే కలిపితే కంటికింపుగా ఉంటాయి. గోదావరి జిల్లాల్లో టిఫిన్లలోకి నంజుడుగా తింటారు దీన్ని. వేసవి కాలంలో దబ్బ ఎక్కువగా దొరుగుతుంది. దొరికినంత కాలం తాజాగా దబ్బకారంచేసుకోవచ్చు!

దబ్బ పండును వానాకాలంలో సైంధవ లవణంతోనూ, వసంత కాలంలో పంచదారతోనూ, చలికాలంలో ఉప్పు, అల్లం, ఇంగువతోనూ, వేసవి కాలంలో బెల్లంతోనూ కలిపి తీసుకోవాలని 'క్షేమకుతూహలం' పాకశాస్త్ర గ్రంథం పేర్కొంది దబ్బపండు శాకినీ డాకినీల్లాంటి రోగాల్ని జయిస్తుందంటాడు క్షేమ శర్మ. శాకినీ డాకినీ అనేవి వైరస్‌లకు మన ప్రాచీన వైద్యగ్రంథాల్లో పేర్లు. ఇమ్యూనిటీ బూస్టర్లా పనిచేస్తుందనేది సారాంశం!





# వేసవిలో సోయాబీన్స్ ఆరోగ్య ప్రయోజనాలు.. తెలిస్తే అస్సలు వదలరు

వేసవిలో శరీరాన్ని చల్లబరిచే, శక్తినిచ్చే ఆహార పదార్థాలను తీసుకోవడం చాలా ముఖ్యం. ఈ కాలంలో సోయాబీన్స్ తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.

వేసవిలో శరీరాన్ని చల్లబరిచే, శక్తినిచ్చే ఆహార పదార్థాలను తీసుకోవడం చాలా ముఖ్యం. ఈ కాలంలో సోయాబీన్స్ తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. రుచిగా లేకపోవడం, వగరుగా ఉండే సోయాబీన్స్‌ను తినడానికి చాలా మంది ఇష్టపడరు. అయితే మాంసాహారంతో సమానమైన పోషకాలు సోయా బీన్స్‌లో ఉంటాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యం కాపాడటంలో, బరువు తగ్గడానికి, కండరాల నిర్మాణంలో, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. వేసవిలో సోయాబీన్స్ తీసుకోవడం వల్ల కలిగే ముఖ్యమైన ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో తెలుసుకుందాం.

- **అలసటను తగ్గించి, తక్షణ శక్తిని ఇస్తుంది**

ఎండల వల్ల వేసవిలో శరీరం త్వరగా అలసిపోతుంది. సోయాబీన్స్‌లో ఉండే అధిక ప్రొటీన్లు, ఐరన్ శరీరానికి అవసరమైన తక్షణ శక్తిని అందిస్తాయి. ఇది రోజంతా మిమ్మల్ని యాక్టివ్‌గా ఉంచడానికి సహాయపడుతుంది.

- **బరువు నియంత్రణ**

వేసవిలో బరువు తగ్గాలనుకునే వారికి సోయాబీన్స్ ఒక అద్భుతమైన ఆహారం అనే చెప్పొచ్చు. ఇందులో ఫైబర్ (పీచు పదార్థం) ఎక్కువగా ఉండటం వల్ల.. దీనిని తిన్న తర్వాత కడుపు నిండినట్లు అనిపిస్తుంది. ఇది అతిగా తినడాన్ని నిరోధించి, బరువును అదుపులో ఉంచుతుంది.

- **గుండె ఆరోగ్యానికి మేలు**

సోయాబీన్స్‌లో సంతృప్త కొవ్వులు తక్కువగా ఉండి, ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. తద్వారా గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.

- **చర్మ ఆరోగ్యానికి రక్షణ**

ఎండ తీవ్రత వల్ల వేసవిలో చర్మం పొడిబారడం, ట్యాన్ అవ్వడం సర్వసాధారణం. సోయాబీన్స్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఇ చర్మాన్ని సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి రక్షిస్తుంది. ఇది చర్మంపై ముడతలను తగ్గించి, గ్లో పెరిగేలా చేస్తుంది.

- **జీర్ణక్రియ మెరుగుపడుతుంది**

వేసవిలో జీర్ణవ్యవస్థ కాస్త మందగిస్తుంది. సోయాబీన్స్‌లో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. ఇది మలబద్ధకం సమస్యను నివారించి, ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

- **ఎముకల బలం**

సోయాబీన్స్‌లో కాల్షియం, మెగ్నీషియం, రాగి (క్రాపర్) వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి వయసు పెరిగే కొద్దీ వచ్చే ఎముకల బలహీనతను (ఆస్టియోపోరోసిస్) అడ్డుకుని, ఎముకలను బలంగా ఉంచుతాయి.

- **శరీర ఉష్ణోగ్రత నియంత్రణ**

వేసవిలో చెమట రూపంలో శరీరం నుంచి పొటాషియం, సోడియం వంటి కీలక లవణాలు బయటకు పోతుంటాయి. సోయాబీన్స్‌లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటానికి, రక్తపోటును అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది.

- **మధుమేహం నియంత్రణ**

మధుమేహం ఉన్నవారికి సోయాబీన్స్ ఒక సూపర్ ఫుడ్. దీని గ్లైసిమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. దీనివల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిలను అకస్మాత్తుగా పెరగనివ్వదు. ఇందులో ఉండే ఐసోఫ్లేవోన్లు ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తాయి.


- **జుట్టు రాలడం తగ్గుతుంది**

ఎండలు, చెమట, ధూళి వల్ల వేసవిలో జుట్టు బలహీనపడి రాలిపోతుంటుంది. సోయాబీన్స్‌లో ఉండే ప్రొటీన్లు, బయోటిన్, ఐరన్ జుట్టు కుదుళ్లను బలంగా ఉంచుతాయి. ఇది జుట్టుకు మంచి పోషణను అందించి, దృఢంగా పెరిగేలా చేస్తుంది.

- **మహిళల ఆరోగ్యానికి రక్షణ**

ముఖ్యంగా మధ్యవయసు దాటిన మహిళల్లో (మేనోపాజ్ దశలో) వేసవి తీవ్రత వల్ల బాడీ హీట్, హఠాత్తుగా ఒళ్లు వేడెక్కడం వంటి సమస్యలు ఉంటాయి. సోయాబీన్స్‌లో ఉండే ఫైటోఈస్ట్రోజెన్లు శరీరంలో హార్మోన్ల సమతుల్యతను కాపాడి, ఈ సమస్యల తీవ్రతను తగ్గిస్తాయి.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com